ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY








మంగళవారం 19 మే 2026 | Tuesday 19 May 2026 | హైదరాబాద్ | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 51 | Vol.No 28 Issue No .51 | Hyderabad | www.visionandhra.in


## మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

- ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
- నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన

న్యూఢిల్లీ,మే18 : భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు మిగతా2లో..





## ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

- తమిళనాడు అనుసరిస్తున్న విధానం అనుసరణీయం
- రాష్ట్రాలకు కేంద్ర కేబినేట్ కార్యదర్శి సోమనాథన్ సూచన



హైదరాబాద్,మే18 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ మిగతా2లో..

## ఈఏపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

- 516 ర్యాంక్ సాధించిన హర్షిణి
- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు
- ఇంజనీరింగ్ లో 10వేల లోపు ర్యాంకులు
- విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అభినందన



హైదరాబాద్,మే18 : మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల మిగతా2లో..

## మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

- భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద
- అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి

హైదరాబాద్,మే18 : మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు.



సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించక పోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. ఃామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మిగతా2లో..

## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

- తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం
- మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్,మే18 : ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మిగతా2లో..

## నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

- కృషి చేసిన పోలీస్ అధికారులకు సన్మానం
- వారి కృషి అసమాన్యమని మంత్రి అమిత్ షా కితాబు

రాయ్‌పూర్,మే18 : దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని మిగతా2లో..



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా

- క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం

హైదరాబాద్,మే18 :ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఇందులో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నరు. ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో జరిగిన జుంబా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మిగతా2లో..






## కేరళంలోనూ మహిళలకు ఉచిత బస్సు

- సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక విభాగం
- ఆశావర్కర్ల గౌరవ వేతనం 3వేలకు పెంపు
- కేరళం సిఎం సతీశన్ కీలక నిర్ణయాలు

మిగతా2లో..

## కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

- ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్
- హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి

తిరువనంతపురం,మే18 : కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల



ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ మిగతా2లో..

## బండి భగీరథపై అదనపు సెక్షన్లు

- మరింత పకడ్బందీగా కేసు విచారణ



హైదరాబాద్,మే18 : పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. మిగతా2లో..



## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

- ముస్లింలకు సిఎం యోగీ ఆదిత్యానాథ్ హెచ్చరిక

లక్నో,మే18 : ఇకపై రోడ్లపై నమాజ్ చేయడం ఉదరదని యూపి ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని మిగతా2లో..




## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఎపి అగ్రగామి

- న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశ
- యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్ షిప్ ఫోరంలో లోకేశ్



న్యూఢిల్లీ,మే18 : ఏపీని భవిష్యత్తు న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం తమ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్ననేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్ షిప్ ఫోరం సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేశ్ అతిథిగా హాజరై మిగతా2లో..

## బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు
- ఇమామ్‌లు, పుజారులకు గౌరవ వేతనం రద్దు
- అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం



కోల్‌కతా,మే18 : సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు మిగతా2లో..

## మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్–యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్–ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్–నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో–నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్–నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

## ఈ-గవర్నేన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ–గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ–గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ–గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ–గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ–గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, శీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

## మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరి÷–టనెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ (ఎఔ÷ంఅఊ) కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన మరియు క్రీడా వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. 5 కిలోమీటర్ల వాకథాన్ ను జెండా ఊపి మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, శివసేన రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, సోనీ బాలాదేవి ప్రారంభించారు.

## కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

అన్నారు. లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించ డాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. ఇకపోతే కోర్టు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. రోడ్లపై నమాజుతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని హెచ్చరించింది.

## కేరళంలోనూ మహిళలకు ఉచిత బస్సు

తిరువనంతపురం,మే18 : కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేరళం ముఖ్యమంత్రిగా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేసిన వీడి సతీశన్ తొలి క్యాబినెట్ సమావేశంలోనే కీలక సంక్షేమ, పాలనా సంబంధిత నిర్ణయాలను ప్రకటించారు. జూన్ 15వ తేదీ నుంచి మహిళలకు కేఎస్‌ఆర్‌టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్టు కూడా ప్రకటించారు. వృద్ధతరం పెరుగుతుండటం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల హెల్త్‌కేర్, సామాజిక భద్రత, పునరావాసం, సంక్షేమ పథకాలను ఈ ప్రత్యేక శాఖ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఆశావర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.3,000కు పెంచుతున్నట్టు కూడా ముఖ్యమంత్రి సతీశన్ ప్రకటించారు. కేరళం హెల్త్‌కేర్ సిస్టంలో ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వర్కర్లు, హెల్పర్లకు రూ.1,000 చొప్పున వేతనం పెంచుతున్నామని, పాఠశాలల్లో వంటపనులు చేస్తున్న వారు, సహాయక సిబ్బంది, ప్రీ–ప్రైమరీ టీచర్లకు అదనంగా రూ.1,000 వేతనం పెంచుతున్నామని చెప్పారు. 2023 నవ కేరళం యాత్ర సందర్భంగా యువజన కాంగ్రెస్ నేతలపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం సతీశన్ ప్రకటించారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధించేందుకు, జవాబుదారీతనాన్ని పాదుకొలిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని, రుణాలు, వ్యయం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పారదర్శకతకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం




మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె÷–లకెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷–రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷–డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్,÷ర్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఒక్కసారిగా రద్దు చేయబోమని సీఎం సువేందు అధికారి ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ



జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బండి భగీరథపై అదనపు సెక్షన్లు

ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 ఆఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయ

## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఎపి అగ్రగామి

ప్రసంగించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని చెప్పుకొచ్చారు. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఏపీకి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. తమకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్ఠాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని చెప్పుకొచ్చారు. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యమని అన్నారు. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్తు సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యూఎస్ ? ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్, సీఈవో మారియా కోర్స్‌నిక్ హాజరయ్యారు.

## ఈపీసెట్ 2026 లో ఎంజేపి విద్యార్థుల హవా

సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు ఈఏపీసెట్–2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాలిఫై కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలిఫై కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

# సంపాదకీయం

## సంక్షోభాల సృష్టికర్తలు...మన పాలకులు !

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పులుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

## పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

- డీసీ భోగేశ్వర్లు




అల్వాల్, మే 18 (విజన్ ఆంధ్ర): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమల నివారణకు సులువైన మార్గమని అల్వాల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లు అన్నారు. దోమల నివారణతోనే డెంగ్యూ నివారణ సాధ్యం అవుతుందని ఆయన అన్నారు. ప్రపంచ డెంగ్యూ నివార ణ దినోత్సవం సందర్భంగా శనివారం అల్వాల్ మచ్చ బొల్లారం వార్డ్ ఆఫీస్ నుండి మచ్చ బొల్లారం మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెంద కుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, దోమల నివారణ గురించి ప్రజలకుఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీ భోగేశ్వర్లు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో ఒకవారానికి మించి నీటి నిల్వ ఉంటే దోమలు పెరిగి అవి కుడితే డెంగ్యూ జ్వరం వస్తోందన్నారు. విపరీతమైన జ్వరం, తలనొప్పి, వంటి నొప్పులు, ఆకలి మందగిం చడం, నీరసం వంటివి డెంగ్యూ లక్షణాలు అన్నారు. కావున, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకుని, నీటి నిల్వ లేకుండా చూసు కోవాలని సూచించారు. దోమ తెరలు వాడటం వంటి జాగ్రత్తలు పాటించినట్లయితే దోమలని నివారించడం జరిగి డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఈ సత్యనారాయణ, ఏఈ సమీర్, సూపర్వైజర్లు వేలు,గణేష్,రాజు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

**- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 18 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, జెడ్పి సీఈవో యాదయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచనలు ఇస్తూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చి పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 40 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి మే 18 (విజన్ ఆంధ్ర) : రైతులు ఎక్కువసేపు కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా కొనసాగించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్రాలలో రైతుల నుంచి వరి సేకరణ, తూకం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు అదనపు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన వరిని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులు లేదా గోదాములకు తరలించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు ఎక్కువసేపు కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, వేగవంతంగా వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగించాలన్నారు. ప్రతి దశలో పారదర్శకత పాటించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ మారథాన్‌కు భారీ స్పందన

**- ప్రతి ఒక్కరూ శారీరకంగా ఫిట్‌గా ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**- ఉత్సాహంగా సాగిన మారథాన్..**

**- ఆకట్టుకున్న యోగా ప్రదర్శనలు**



నిర్మల్ జిల్లా, మే 18,(విజన్ ఆంధ్ర); ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగా, వ్యాయామాలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. “ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక” యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన “ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ, మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ” కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) నుంచి ప్రారంభమైన మారథాన్ ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, యోగా, శారీరక వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నిరంతర శారీరక శ్రమ వల్ల అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. యోగా, ఎక్సర్‌సైజ్‌ల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఈఓ భోజన్న, సిపిఓ జీవరత్నం, మునిసిపల్ కమిషనర్ రవి బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**






వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 18 (విజన్ ఆంధ్ర) : క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ... క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ మరియు స్పోర్ట్స్ వారోత్సవాల సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వనపర్తిలో 2కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ 2కే రన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా హాజరై అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి జెండా ఊపి రన్ ప్రారంభించారు. బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి బస్ డిపో మీదుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు ఈ 2కే రన్ సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 99 డేస్ ప్రజా పాలనలో భాగంగా యువజన మరియు క్రీడల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడల పట్ల ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ, క్రీడల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఒక భాగంగా మారాలని సూచించారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటే మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని, అందరూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వనపర్తి జిల్లాలో బాక్సింగ్ స్పోర్ట్స్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏ ఎస్ పి రాజేష్ మీనా మాట్లాడుతూ క్రీడలను అలవాటు చేసుకోవడం వల్ల శారీరకంగా దృఢంగా ఉండడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ కలిగి ఉండాలని తద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోగలమని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన మరియు క్రీడల వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూత్ మరియు స్పోర్ట్స్ వీక్, టూరిజానికి సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. యూత్ మరియు స్పోర్ట్స్ వారోత్సవాల్లో భాగంగా ఈ వారం ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు. యువతలో స్కిల్ డెవలప్మెంట్, యూత్ పార్లమెంట్, స్వచ్ఛదనం మరియు పచ్చదనం, వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న యువతకు సన్మాన కార్యక్రమాలు వంటివి వారోత్సవాల రోజువారి కార్యక్రమాల్లో భాగంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బాలాజీ నాయక్, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భవిష్యత్తు విపత్తులకు జిల్లా యంత్రాంగం అప్రమత్తం

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- వరద ముప్పును ఎదుర్కొనేందుకు 'లైవ్ డెమో'**







వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 18 (విజన్ ఆంధ్ర) : విపత్తుల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (చీణపీూ) ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం (ూణ=ఖీ) సూచనల మేరకు వనపర్తి పట్టణంలోని నల్ల చెరువులో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా నల్ల చెరువులో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే నల్ల చెరువు ప్రాంతంలో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మోక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం లో వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిఎస్పి గిరి ప్రసాద్, ఇతర జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆశాభోస్లే' పురస్కారం అందుకున్న గాయని 'ఎస్. పి. శైలజ'

హైదరాబాద్ మే 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ.విశ్వనాథ్ ) : ప్రముఖ సాంస్కృతిక, సాంఘిక సంస్థ “ఆనంద భైరవి“ 14 వ వార్షికోత్సవాని పురస్కరించుకొని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుమధుర గాయని “శారదా సాయి“ నేపథ్యంలో దాదాసాహెబ్ఫాలే అవార్డు గ్రహీత, పద్మవిభూషణ్, ప్రఖ్యాత గాయనీమణి 'ఆశాభోస్లే' కి నివాళి అర్పిస్తూ నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది, పాటల పల్లకిలో విహరింపజేసింది. శుక్రవారంనాడు రవీంద్రభారతి మెయిన్ ఆడిటోరియం, హైదరాబాద్ లో కన్నుల పండుగగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రఖ్యాత గాయని ఎస్. పి. శైలజ హాజరై 'ఆశాభోస్లే' పురస్కారాన్ని అతిథుల చేతుల మీదుగా అందుకున్నారు. తన సుస్వరమైన కంఠంతో గాయని ఎస్. పి. శైలజ, కార్యక్రమ నిర్వాహకురాలు శారదా సాయి, ప్రముఖ గాయకులు షాహ్నవాజ్, కల్లేపల్లి మోహన్, డాక్టర్ బంటి లతో కలసి శ్రవణానందకరంగా, సుమధురంగా 'ఆశాభోస్లే' పాటలు పాడి ప్రేక్షకుల మనస్సులను దోచుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గాయని శైలజ, మేడిది సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు బట్టలను అందజేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా సంచాలకుడు, భాషా, సాంస్కృతిక శాఖ, తెలంగాణ, డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి, ఐఎఎస్, విశిష్ట అతిథులుగా ఏలూరి శ్రీనివాస రావు స్టేట్ ప్రెసిడెంట్, తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్, సెక్రెటరీ జనరల్ సెంట్రల్ టిజిఇజె.ఎస్. హైదరాబాద్, దోనేపూడి చక్రపాణి అసిస్టెంట్ డైరెక్టర్, హార్టీకల్చర్, హెచ్ ఎమ్ డి ఎ,, సంగుమారి చంద్రశేఖర్ ఫౌండర్ చైర్మన్, తిరుమల కో-అపరేటివ్ అర్బన్ బ్యాంక్, ప్రత్యేక అతిథిగా ఎన్. రామచందర్ రావు బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు హాజరై గాయని ఎస్. పి. శైలజకు శుభాకాంక్షలు తెలిపారు, శారదా సాయి బృందాన్ని అభినందించి, ప్రశంశించారు. అలాగే, ఋతు రాగాలు సేమ్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్, ఫిజీషియన్, గాయకుడు డాక్టర్ 'బంటి' కి, గాయకుడు 'షాహ్నవాజ్' కి, ప్రముఖ గాయకుడు 'కల్లేపల్లి మోహన్' లకు ఆనందభైరవి బెస్ట్ మ్యూజీషియన్స్ అవార్డులను, చైర్మన్ మేడిది సుబ్బయ్య ట్రస్ట్ 'మేడిది వెంకటేశ్వరరావు' కి ఆనందభైరవి విత్వ సేవానిరతి పురస్కారం అలాగే, కళాసేవ, సేవారత్న కళాబంధు 'వడ్లకొండ వెంకట్రావు' కి ఆనందభైరవి గెస్ట్ స్టార్ పురస్కారం, వర్ధమాన చిత్రనిర్మాత, స్క్రీన్ రైటర్, గీత రచయిత్రి, ఆధ్యాత్మిక నిపుణురాలు , చిత్ర దర్శకురాలిగా తన తొలి అడుగు వేస్తున్న 'రజిత కల్పద' కు ఆనంద భైరవి విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేసి గౌరవించి ఘనంగా అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమానికి చక్కటి వ్యాఖ్యానాన్ని గాయని యోగిత అందించారు.



# పవర్ బోర్ కు విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలి



మల్కాజిగిరి, మే 18, (విజన్ ఆంధ్ర):నేరేడ్ మెట్ భగత్ సింగ్ నగర్ కాలనీలో పవర్ బోర్ కు విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ కాలనీ వాసులు, ఏఈ సుమతి క్రిష్టిణను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ మా కాలనీ లోని పవర్ బోర్ కు గా విద్యుత్ మీటర్ లేక పోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు. ఈ బోర్ కు వెంటనే విద్యుత్ మీటర్ బిగించి, వాడకంలోకి తీసుకుని రావాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లింగమయ్య, కృష్ణ మూర్తి, దేవ, ప్రసాద్, శ్రీధర్, వేణు, శ్రీకాంత్, దాస్,ప్రదీప్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుపాకుల జనార్దన్, హరి, కోటేష్,టీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రాధాన్యం

**- ప్రజావాణిలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా వెల్లడి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 18 (విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యలను వేగవంతంగా, చట్టబద్ధంగా పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని వనపర్తి అదనపు ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు ఎస్పీకి నేరుగా వివరించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు నిర్భయంగా తమ సమస్యలను తెలియజేసే వేదికగా మారిందన్నారు. ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తోందన్నారు. ప్రజలు పోలీసు శాఖపై విశ్వాసం ఉంచి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో 2 భార్యాభర్తల వివాదాలు, 3 భూ తగాదాలు, 5 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ తోనే ప్రజలకు న్యాయం, అభివృద్ధి

**- మొహమ్మద్ ముస్తాక్**





హైదరాబాద్ మే 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : ప్రపంచ సహాయ టీకా దినోత్సవాన్ని సంధర్భంగా వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తూ, అలాగే ఎయిడ్స్ రహిత సమాజం దిశగా అవగాహన కల్పిస్తూ, సామాన్యులకు తన వంతు బాధ్యతగా మెరుగైన సేవలందిస్తూ వారికి అండగా నిలుస్తూ, పేదల పాలిటి పెన్నిధిగా గొప్ప పేరు సంపాదించుకుశీటూ ముందడుగు వేస్తూ, కాంగ్రెస్ పార్టీ తోనే అందరి ప్రజలకు న్యాయం, మంచి అభివృద్ధి జరుగుతుందని అలాగే యువతలో స్ఫూర్తిని పెంపొందిస్తూ, మంచి మార్గ నిర్దేశం చేస్తున్న చంద్రాయణగుట్ట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ మైనారిటీ జనరల్ సెక్రటరీ జనాబ్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు 'మొహమ్మద్ ముస్తాక్' ను ప్రశంశిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు అలాగే, చైర్మన్ మైనార్టీ డిపార్ట్మెంట్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ 'ఇర్ఫాన్ అలీ' అభినందనలు, శుభాకాంక్షలను అందుకుంటున్నారు.

# కడుపుబ్బ నవ్విస్తున్న వినోదాత్మక నవ్వుల సందడి







హైదరాబాద్ మే 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ.విశ్వనాథ్ ) : "తెలంగాణ ప్రజాకళ" మహోత్సవం తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ ప్రజాకళల పరిరక్షణకు వేదికగా నిలుస్తోందని, ఇటువంటి కార్యక్రమాలు కళాకారులకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అతిధులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ నిర్వహణలో రవీంద్ర భారతి హైదరాబాద్ లోని "పాల్కురికి సోమన్న మూల" వేదికపై కొనసాగుతున్న ప్రతిష్ఠాత్మక "తెలంగాణ ప్రజాకళ" 99 రోజుల సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమాలకు ప్రేక్షకులనుండి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న 'కామెడీ' వారంలో భాగంగా ఆదివారం సాయంత్రం కార్యక్రమం నవ్వుల సందడితో అలరించింది. ఈ కార్యక్రమంలో ఆనందలహరి బృందం తమ వినోదాత్మక ప్రదర్శనలతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. ఖమ్మం సుధాకర్ స్టాండప్ కామెడీ, హాస్యావధాని శంకరనారాయణ తన చమత్కార సంభాషణలతో హాస్య ప్రహసనాలతో సభికులను అలరించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రేణుక పాడిన పేరడీ పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని సభలో నవ్వుల వెల్లువ పారించాయి. అలాగే రోషిరెడ్డి, పానుగంటి వెంకటేష్, మహేష్ రేగుల, దామోదర్ కామెడీ, హాస్యరసభరిత స్కిట్స్ ప్రదర్శనలతో ప్రాంగణం అంతా సందడి వాతావరణంలో మునిగిపోయింది. ప్రేక్షకుల కేరింతలు, చప్పట్లతో కార్యక్రమం ఆహ్లాదభరితంగా కొనసాగింది. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐ.ఏ.ఎస్., హాస్య కళాకారులను ఘనంగా సత్కరించారు. తెలంగాణ ప్రజాకళల అభివృద్ధికి కళాకారులు చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సిబ్బంది నర్సింలు, డాక్టర్, విజయ్ కుమార్, ముచ్చర్ల దినకర్, పల్లె నర్సింహ్మా, వ్యాఖ్యాత విద్యానందాచారి, ఎ. రవి కుమార్, శివ కుమార్ పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మాపల్లె శంకర్, బాలు ప్రసాద్, సృజన్, నరేష్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్లో ఉత్సాహంగా మారథాన్ రన్ నిర్వహణ. ..



నిర్మల్ జిల్లా, మే 18,(విజన్ ఆంధ్ర); ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ నిర్మల్ పట్టణంలో ప్రజాపాలన ప్రగతిప్రణాళిక యువజనోత్సవాల్లో భాగంగా ఉదయం మారథాన్ రన్ నిర్వహించారు. స్థానిక శివాజీ చౌక్ నుండి ఎన్టిఆర్ మినీస్టేడియం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తితో పాటు ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు , ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ ఈప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. మారథాన్ రన్ శారీరకంగా మరియు మానసికంగా మనిషికి అనేక ప్రయోజనాలు అందిస్తుందని, రోజువారీ వ్యాయామం, సమయపాలన వంటి మంచి అలవాట్లు పెరుగుతాయన్నారు. ఆరోగ్యం, పర్యావరణం, సామాజిక సేవ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కలుగ జేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మారథాన్ రన్ తీసుకుందని తెలిపారు.

# యోగ, వ్యాయామం మన జీవితంలో ఒక భాగం కావాలి

**- అదనపు కలెక్టర్ నర్సింగరావు**




గద్వాల మే 18 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, యోగ, వ్యాయామం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా యువజన, క్రీడల, టూరిజం శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూత్, టూరిజం వీక్ సెలబ్రేషన్స్ ను సోమవారం గద్వాల ఇండోర్ స్టేడియం వద్ద ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ నర్సింగరావు 5కే, 2కె మారథాన్, వాక్ థాన్, హెరిటేజ్ వాక్ లను జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ ప్రధాన రహదారుల మీదుగా నిర్వహించిన ఈ వాక్ లో విద్యార్థులు, క్రీడాకారులు, యువత, వ్యాయామ ఉపాధ్యాయులు, పలువురు విశ్రాంత ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే వివిధ శాఖల ఆధ్వర్యంలో సంబంధిత వారోత్సవాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇందులో యూత్ వీక్ సెలబ్రేషన్స్ ప్రధానమైనవని, వారం పాటు నిర్వహించే కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పేర్కొన్నారు. స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వివిధ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మనిషి ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. మన శరీరం నియంత్రణలో ఉండేందుకు యోగ, వ్యాయామాన్ని కూడా ప్రతిరోజు చేస్తుండాలని సూచించారు. పౌష్టికాహారం, తగినంత నిద్ర, మంచి అలవాట్లు కూడా మనిషి ప్రశాంత జీవనం గడపడానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని, సెల్ ఫోన్స్ చూడడం తగ్గిస్తే మంచి పౌరులుగా ఎదగవచ్చున్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, ఎస్ జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విపత్కర పరిస్థితిల్లో ప్రజలను అప్రమత్తత చేయాలి

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్**




అలంపూర్ మే 18 (విజన్ ఆంధ్ర) : వరదలు, ఇతర విపత్కర సమయాల్లో ప్రజలను ముందస్తుగా అప్రమత్తత చేయడం ద్వారా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడవచ్చని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అన్నారు. సోమవారం అలంపూర్ లో తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో, కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో వరదలు, పారిశ్రామిక ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నమూనా ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర సహాయక కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కట్టలపేట ప్రాంతంలో గాయపడిన బాధితులను అంబులెన్స్‌ల ద్వారా ప్రథమ చికిత్స కేంద్రాలకు ఎలా తరలించాలో ప్రదర్శించారు. అనంతరం తుంగభద్ర ఘాట్ వద్ద నిర్వహించిన వరద మాక్ డ్రిల్‌లో ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, వైద్య శాఖల సిబ్బంది బోట్ల సహాయంతో వరదలో చిక్కుకున్న వారిని రక్షించే విధానాన్ని ప్రయోగపూర్వకంగా ప్రదర్శించారు. రెస్క్యూ చర్యలు చేపట్టి, బాధితులకు వైద్య పరీక్షల అనంతరం ఆసుపత్రులకు తరలించడంను ప్రయోగపూర్వకంగా వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సమీపంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన రిలీఫ్ సెంటర్‌కు తరలించి ఆశ్రయం కల్పించడం, అక్కడ బాధితులకు ఆహారం, త్రాగునీరు, వైద్య సేవలు , అవసరమైన ఇతర సౌకర్యాలను అందించడాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో భారీ వరదలు వస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడడం, సురక్షిత ప్రాంతాలకు తరలించి పక్కాగా సహాయక చర్యలు చేపట్టేందుకు మాక్ ఎక్సర్ సైజ్ దోహదపడుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య, మత్స్య, మున్సిపల్ తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో ఎలా పనిచేయాలో ప్రాక్టికల్‌గా ప్రదర్శించామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం ప్రజలకు అండగా నిలుస్తుందని, సహాయక చర్యలు వేగవంతంగా చేపడుతుందన్నారు. ప్రజలు ఎలాంటి విపత్తు పరిస్థితుల్లోనూ భయాందోళనలకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మున్సిపల్ చైర్మన్ జయరాములు, జిల్లా అగ్నిమాపక అధికారి అశోక్, తహసీల్దార్ ప్రభాకర్, వైద్య, పోలీస్, బెటాలియన్ మున్సిపల్, విద్యుత్, రెస్క్యూ బృందాలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలి

**- దిశ సమావేశంలో ఎంపీ మల్లు రవి**




గద్వాల మే 18 (విజన్ ఆంధ్ర) : సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ చేరేలా జిల్లా అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి అన్నారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశాన్ని సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఎంపీ మల్లురవి వివిధ శాఖల అధికారులు ఇచ్చిన గణాంకాల నివేదిక ప్రకారం వారి పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయకపోతే ప్రయోజనం ఉండదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలని, అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఆయా బ్యాంకులకు నిర్దేశించిన వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఇతర రుణ లక్ష్యాలను వంద శాతం చేరుకోవాలని ఆదేశించారు. పీఎం సురక్ష బీమా యోజన, పీఎం ఈజీపి, తదితర పథకాలకు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వివిధ సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్లను అర్హులైన విద్యార్థులతో భర్తీ చేయాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏటా నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటిన మొక్కల్లో ఎన్ని మొక్కలు బతికాయో నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నందున గద్వాల బ్రాండ్ ను కాపాడేందుకు మార్కెటింగ్ అవకాశాలను పెంచాలన్నారు. వివిధ క్లస్టర్ల ద్వారా చేనేత కార్మికులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆయా శాఖల్లో అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు సద్వినియోగం అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ పిలుపునిచ్చారు. సమావేశానికి గైర్హాజరైన పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అలంపూర్ శాసనసభ్యులు విజేయుడు, గద్వాల, వడ్డేపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్స్ జయలక్ష్మి, మంజుల, అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, దిశ కమిటీ సభ్యులు రాజు, గిరిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**- విద్యుత్, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**

**- సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల**




నిర్మల్ జిల్లా, మే 18,(విజన్ ఆంధ్ర) : బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రార్థనా స్థలాల్లో తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పండుగ నేపథ్యంలో పురపాలక, గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈద్గాల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. అలాగే ప్రార్థనల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ప్రజలు అన్ని పండుగలను పరస్పర సహకారం, సామరస్యంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్లు అప్పాల గణేష్ చక్రవర్తి, బిబి కుతిజ సిద్ధికి, వివిధ శాఖల అధికారులు, హిందు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# ఈనెల 22వ తేదీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి సమావేశం నిర్వహణకు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 18 మే : ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం నిర్వహినకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసిసమావేశమందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఏర్పాట్లపై ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రజలను ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం పెంచేందుకు ఉద్దేశించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ఇప్పటికే గ్రామ మండల మరియు నియోజకవర్గ స్థాయి సమావేశాలను పూర్తి చేయడం జరిగిందని ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించాలని ఈ సమావేశానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు తదితర ఏర్పాటు చేయాలని సమావేశం ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయాలని అదేవిధంగా ప్రజలకు వివరించేందుకు శాఖల వారీగా ఇందిరమ్మ ఇండ్లు, మాహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు బీమా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్న రకం వడ్లకు ప్రోత్సాహకం, ఆసరా పింఛన్లు తదితర పథకాల వివరాలను సిద్ధం చేయాలని, లబ్ధిదారులతో మాట్లాడించేందుకు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లతో వరి ధాన్యం కొనుగోలు విషయంలో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



సిద్ధిపేట జిల్లా ప్రతినిధి 18 మే : సిద్దిపేట జిల్లాలోని రా రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించి ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్నిదించుకోవాలని జిల్లాకలెక్టర్కె.హైమావతి సూచించారు.సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని రా రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి వారి మిల్లులలో వరి ధాన్యాన్ని దించుకోవడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈసారి రబీ సీజన్లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వరిధాన్యం పండిందని వాటిలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఇప్పటికే 1లక్షా 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని రేపట్లోగా మరొక 20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని తెలిపారు. వాతావరణం అనుకూలించి అధికంగా ధాన్యం దిగుబడి వచ్చిందని అన్నారు. గ్రామాల వారీగా రైస్ మిల్లుల వారిగా ధాన్యాన్ని కేటాయిస్తామని జిల్లాలోని రా రైస్ మిల్లర్లు వారి మిల్లులో 40 శాతం కెపాసిటీతో మొత్తం 1లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్లో జిల్లాలో అధిక శాతం సన్న రకం వరి ధాన్యాన్ని రైతులతో పండించేందుకు ప్రభుత్వ ఆదేశాలు మేరకు రైతులను మోటివేట్ చేస్తున్నామని మిల్లర్లు కూడా రైతులకు సన్న రకం వరిధాన్యాన్ని పండించడంపై చైతన్యంతీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ,జిల్లాపౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, రా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క ఉద్యమకారుని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి 18 విజన్ ఆంధ్ర : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన రాష్ట్ర ఉద్యమకారుల కమిటీ సభ్యులను కుమురం భీం అసిఫాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల కమిటీ కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కుమురం భీం అసిఫాబాద్ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ కొండ్ర రాజేశ్వర్, ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల కమిటీని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయం అని,రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందని, నాడు రాష్ట్ర ఏర్పాటు సాధనలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారులను ఆదుకోవాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపర్తి అశోక్, ఎరుబోతుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పి జి ఆర్ ఎస్ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

**- జిల్లా రెవెన్యూ అధికారి మల్లిఖార్జునుడు**



కడప,మే 18 (విజన్ ఆంధ్ర): అర్జీదారులకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించి.ప్రజా సమస్యలను 0 % కి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా రెవెన్యూ అధికారి మల్లిఖార్జునుడు పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి తో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వేసవిలో అర్జీదారుల ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని.క్షేత్ర స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని. జిల్లా అధికారులకు సూచించారు.ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధితసమస్యలను.పరిష్కరించుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు. 1) వేంపల్లి మండలంకు చెందిన టి.లక్ష్మీదేవి తన ఆధార్ కార్డు లోని తప్పులను సరిచేసి ఇల్లు మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు. 2) పెండ్లిమర్రి మండలం కు చెందిన తన ఇంటి స్థలం కు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించ వలసిందిగా అర్జీ సమర్పించారు. 3) చెన్నూరు మండలం కు చెందిన టి.ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తి మండలం లోని సిరి మెగా టౌన్ షిప్ నందు నీటి వసతి కల్పించాలని అర్జీ సమర్పించారు. 4) చిట్వేల్ మండలం కు చెందిన కే లక్ష్మీ నారాయణ అనే వ్యక్తి నాటు కోళ్ల వ్యాపారం మొదలు పెట్టుటకు ఎస్సీ కార్పొరేషన్ కింద స్థలంను కేటాయించ వలసిందిగా అర్జీ సమర్పించారు. 5) ప్రొద్దుటూరు కు చెందిన ఆర్.అశోక్ కుమార్ అనే వ్యక్తి కొత్తపల్లి నుండి వెల్లాలకు రోడ్డు కొత్త రోడ్డు వేయాలని అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నీట్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- ఏ ఐ ఏఫ్ డి ఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్**




శేరిలింగంపల్లి. మే 18: ( విజన్ ఆంధ్ర) : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : ఏ ఐ ఏఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున , రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి దేశవ్యాప్తంగా 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నీ ట్ పరీక్షా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, పేపర్ లీకేజీలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు (ఏ ఐ ఏఫ్ డి ఎస్) అఖిల భారత ప్రజాతంత విద్యార్థి సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం మియాపూర్ ఎం. ఏ .నగర్ తాంద్ర రామచంద్రయ్య భవన్ లో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా లిఏ ఐ ఏఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జునలి మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల ఆశయాలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని మండిపడ్డారు. నీట్ పరీక్షలు ప్రతి సంవత్సరం అవినీతి, పేపర్ లీకేజీలు, అక్రమాలతో వార్తల్లో నిలుస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్. టి .ఏ.ఎలాంటి సంస్కరణలు తీసుకురాకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, మరోవైపు పేపర్ లీకేజీ మాఫియా కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఉన్న పెద్దల్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందుకే అసలు నిందితులు బయటకు రావడం లేదని విమర్శించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో ఆటలాడే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని, వెంటనే ఎన్. టి. ఏ.ను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, లేకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. అలాగే నీట్ పేపర్ లీకేజీ వెనుక ఉన్న మాఫియాను పూర్తిగా వెలికితీసి, వారికి కఠిన శిక్షలు విధించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నీట్ లీకేజీకి బాధ్యులు ఎవరు? బిజెపి ప్రభుత్వం సమాధానం చెప్పాలి!" "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి!" ఎన్ టి ఏ రద్దు చేయాలి!" "విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆపాలి!" "పేపర్ లీకేజీ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి!" ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి , అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎప్ సెట్ ఫలితాల్లో 'రెజోనెన్స్' విజయఢంకా!




హనుమకొండ, మే 18 : తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నేడు విడుదల చేసిన టీజీ ఎప్ సెట్-2026 ఫలితాల్లో హన్మకొండ, వరంగల్‌కు చెందిన 'రెజోనెన్స్ జూనియర్ కళాశాల' విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి తమ విజయపరంపరను చాటుకున్నారు. జాతీయ స్థాయి పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్ ఫలితాల్లోనే కాకుండా, రాష్ట్ర స్థాయి ఈఏపీసెట్ ఫలితాల్లోనూ ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని సంస్థ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు
డి. స్నితిక (హాల్ టికెట్ నెం: 2611ట01229) 753వ ర్యాంకు
సిహెచ్. భువనేశ్వరి (హాల్ టికెట్ నెం: 2611ట01940) 878వ ర్యాంకు
డి. సంజన (హాల్ టికెట్ నెం: 2612ట01245) 925వ ర్యాంకు
ఎ. రితిక (హాల్ టికెట్ నెం: 2624ట012134) 982వ ర్యాంకు
10 వేల లోపు 291 మందికి ర్యాంకులు

ఈ నలుగురు టాపర్లతో పాటు కళాశాలకు చెందిన మరో 291 మంది విద్యార్థులు 10 వేల లోపు ఉత్తమ ర్యాంకులు సాధించి ఘన విజయం సాధించారు. వీరంతా తెలంగాణ రాష్ట్రంలోని టాప్-10 ఉన్నతశ్రేణి కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందని యాజమాన్యం వెల్లడించింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రాజిరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల కష్టానికి, అధ్యాపకుల అంకితభావానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఘన విజయానికి సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి, శ్రేయోభిలాషులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. కళాశాలలో నిర్వహించిన ఈ విజయోత్సవ కార్యక్రమంలో రెజోనెన్స్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డితో పాటు, డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏఓ లెక్కల రమ్య రాజిరెడ్డి, డీన్ బి.ఎస్. గోపాల్ రావు, ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# గాంధీనగర్ గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ సభ.




ములుగు మే 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో 350 మంది గ్రామ ప్రజలతో ఆదర్శ గ్రామ నిర్మాణం పై అవగాహన కల్పిస్తూ గ్రామ సభను నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలవికాస ఆదర్శ గ్రామం పథకం సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్డు భవనాలు నిర్మించుకోవడం కాదు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టు బాట్లు నియమాలు పద్ధతులు పెట్టుకుని వాటిని పాటిస్తూ ఊరంతా కలిసి ఒకే మాట ఒకే బాటలో ఐక్యముతో ఉంటే ఆదర్శ ఆదర్శ గ్రామం సాధించుకోవచ్చని అభివృద్ధి గ్రామానికి ఆదర్శ గ్రామానికి తేడా మనకు అర్థం కావాలని డబ్బులుంటే అభివృద్ధి చేసుకోవచ్చు కానీ ఆదర్శ గ్రామమంటే ప్రజలందరూ కలిసి ఒకరికొకరు ఆలోచనలు అభిప్రాయాలు పంచుకుంటూ ఐక్యమత్యంతో గ్రామంలో ఉన్న వనరులను గుర్తించి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవచ్చు ఈ సందర్భంగా ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం గ్రామ సర్పంచ్ బానోత్ ,నిర్మల వెంకన్న మాట్లాడుతూ మా గ్రామంలో పాల వికాసం సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామపంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాము బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో మా గ్రామం ఎన్నుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు ఈరోజు మా గ్రామంలో ఒక పండగ వాతావరణం ఉందన్నారు గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవడానికి ముందుకొచ్చిన కమిటీ వాళ్లకు అభినందనలు తెలుపుతున్నాము అందరం కలిసి మన గ్రామాన్ని మార్చుకున్నామని గ్రామస్తులకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో, గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్, పంచాయతీ కార్యదర్శి రఘు, వార్డు సభ్యులు, మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, రామావత్ సంధ్య, తేజావత్ హుని, లిక్కి కుమారస్వామి, లాకావత్ ఈరయ, బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజ్ కుమార్ , డెవలప్మెంట్ ఏజెంట్లు , కే వినయ్ కుమార్, శంకర్ గ్రామం పెద్దలు గ్రామ ప్రజలు యువకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎప్ సెట్ - 2026 ఫలితాల్లో "శివాని విశ్వరూపం"




హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 19 ( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ ఎప్ సెట్ - 2026 ఫలితాల్లో హన్మకొండ పాలివేల్పుల లోని ప్రముఖ విద్యాసంస్థ "శివాని జూనియర్ కళాశాల" విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులతో ఘన విజయం సాధించి విద్యా రంగంలో తమ కళాశాల ప్రత్యేకతను చాటుకున్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని బి. స్వాతి (స.ం.చీశీ: 2611ట01395) స్టేట్ లెవెల్లో 150వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ప్రకటించిన వివరాల ప్రకారం.. టాప్ ర్యాంకర్లతో పాటు కళాశాల విద్యార్థులు భారీ సంఖ్యలో ఉత్తమ ర్యాంకులు సాధించారు.

ముఖ్యమైన ర్యాంకుల వివరాలు
బి. స్వాతి 150వ ర్యాంకు
ఎన్. చరణ్య 2426వ ర్యాంకు
కె. సౌందర్య 3649వ ర్యాంకు
ఎ. నవ్య 4435వ ర్యాంకు
ఎ. రథ్య 4838వ ర్యాంకు
జి. పూజిత 5744వ ర్యాంకు
పి. యశ్వంత్ 6475వ ర్యాంకు
ఇ. శ్రీశాంత్ వర్మ 6863వ ర్యాంకు

వీరితో పాటు ఎం. ఐశ్వర్య (7166), ఇ. కృష్ణజ (7840), బి. అంజనా శ్రీ (8548), ఎన్. జష్వంత్ (9018), డి. సాయి కార్తికేయ (9114), చ. అన్వేష్ (10318), పి. సహస్ర శ్రీ (10997) తదితరులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి కళాశాల కీర్తిని దశదిశలా చాటారు. "ప్రతిభావంతులైన విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం అందరికీ సాధ్యమే.. కానీ సాధారణ విద్యార్థులను కూడా అత్యుత్తమ ర్యాంకర్లుగా మార్చడమే శివాని కళాశాల ప్రత్యేకత." గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలు సాధిస్తూ, ఈ ఏడాది కూడా చరిత్రను తిరగరాసిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ టి. స్వామి, ప్రిన్సిపాల్స్ జి. సురేందర్ రెడ్డి, వి. చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు, ఎన్. రమేష్, ఎ. మురళీధర్, వి. సురేష్, ఎస్. సంతోష్ రెడ్డి లు ప్రత్యేకంగా అభినందించారు.ఈ అఖండ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు కళాశాల యాజమాన్యం ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నికల ఫలితాలు



హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 18 ( విజన్ ఆంధ్ర ) : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఎన్నికల అధికారి కంకణాల సంతోష్ ప్రకటించారు. అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, కార్యదర్శిగా ఊటుకూరి సీతారామారావు (సాయిరాం), కోశాధికారిగా పొడిశెట్టి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా దండుమోహన్, ఇమ్మడి ప్రసాద్, గునిశెట్టి విజయభాస్కర్, అల్లె రామారావు, సహాక్ష్ కార్యదర్శులుగా జి. బాలరాజు, గన్ను సంతోష్ కుమార్, బోయిని భిక్షపతి, ఎండీ ఖాదర్ పాష, కార్యవర్గ సభ్యులుగా డి.రాధాకృష్ణ, జి.రామానుజం, ఆర్వీ దామోదర్, పి.ప్రదీప్ రాజ్, ఎండీ జమాలొద్దిన్, ఎ. సాంబశివరాజు, ఎండీ ఉస్మాన్ పాష, ఎండీ ఫజర్ ఉర్ రహమాన్, ఎ.విష్ణువర్ధన్ రాజు, ఆర్. శ్రీధర్, ఎం.ఓదెలు, ఓదెల.శివకుమార్, కొట్టె. సుధాకర్, పులికంటి రాజేందర్, ఎం. సంతోష్ కుమార్, ఇ.జగన్, ఏ.కొమ్మాలు లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కంకణాల సంతోష్ అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడు, కార్యదర్శి హోదాలకు ఎన్నిక జరగ్గా, మిగతా కార్యవర్గం అంతా ఏకగ్రీవంగా ఎన్నికైంది. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనే ధ్యేయంగా నూతన కమిటీ బాధ్యతాయుతంగా పనిచేస్తుందని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఆకాంక్షించారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి జిల్లాలోని పలువురు సీనియర్ జర్నలిస్టులు, పాత్రికేయ మిత్రులు అభినందనలు తెలిపారు. కాగా అధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు ఎన్నిక జరగ్గా మొత్తం 407 ఓట్లకు గాను 217 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షులు గా పోటీ పడ్డ గడ్డం కేశవమూర్తి కి 208 ఓట్లు రాగా, తన ప్రత్యర్థి గుంటి విద్యాసాగర్ కు 4 ఓట్లు వచ్చాయి. 5 ఓట్లు చెల్లలేదు. దీంతో తన ప్రత్యర్థి గుంటి విద్యాసాగర్ పై 204 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కార్యదర్శి గా పోటీచేసిన ఉట్కూరు సాయిరాం కు పోలైన 217 ఓట్లలో 204 ఓట్లు రాగా ప్రత్యర్థి మేరుగు రాజేంద్రప్రసాద్ కు 7 ఓట్లు లభించగా, 6 ఓట్లు చెల్లలేదు. తన ప్రత్యర్థి మెరుగు రాజేంద్ర ప్రసాద్ పై ఉట్కూరు సాయిరాం 197 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రెండురోజులుగా ఎంతో ఓపికతో ఎన్నికలు నిర్వహించిన ఆర్వో కంకణాల సంతోష్ మరియు ఏఆర్వోలు, అబ్జర్వర్లుగా వ్యవహరించిన గాడిపెల్లి మధు, పీవీ మదన్ మోహన్, పిన్నా శివకుమార్, వల్లాల వెంకటరమణ, పెండెం వేణుమాధవ్ లను, సహాయకులను రాష్ట్ర అధ్యక్షులు కే విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ లు అభినందించారు.

# సిద్దిపేట జిల్లా చేనేత సహకార సంఘాల తుది ఓటర్ల జాబితా విడుదల



సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 18 : సిద్దిపేట జిల్లాలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా, అర్హులైన ఓటర్లతో కూడిన తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయబడిందని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకటనలోని ముఖ్యాంశాలు:

సభ్యత్వాల ఖరారు:

సంబంధిత సహకార సంఘాలకు చెందిన సభ్యుల వివరాలు మరియు అర్హతా ప్రమాణాలను సహాయ సంచాలకులు (ూణ) స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, తుది సభ్యత్వ జాబితాను అధికారికంగా ఆమోదించారు.

సవరణల పూర్తి:

గతంలో విడుదల చేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలు, పేర్ల సవరణలు మరియు చేర్పులనుపరిష్కరించడంలో నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఈ జాబితానురూపొందించారు.

జాబితా ప్రదర్శన:

సభ్యుల సమాచారం కోసం, ఖరారు చేసిన ఈ వివరాలను సిద్దిపేటలోని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ కార్యాలయ నోటీసు బోర్డుపై, అలాగే సంబంధిత ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు.

ఎన్నికల అధికారులకు ప్రతిపాదనల సమర్పణ:

ఎన్నికలు సజావుగా జరిగేలా చూసేందుకు, సహాయ సంచాలకులు స్థాయిలోఆమోదించబడిన ఈ తుది ప్రతిపాదనలను రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులకు వీలైనంత త్వరగా సమర్పిస్తామని ఆ అధికారి స్పష్టం చేశారు. తదుపరి ఎన్నికల ప్రక్రియ మొత్తం ఈ తుది జాబితా ఆధారంగానేనిర్వహించబడుతుందని నొక్కిచెప్పిన సహాయ సంచాలకులు, అర్హులైన సభ్యులందరూ ఈ ప్రకటనను గమనించాలని కోరారు.

# జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం

**- వయో వృద్ధుల్ల నాన్ని యువతరం అందుకోవాలి**
**- వయోవృద్ధుల ఆదరణ అభినందనీయం**
**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**




జనగామ, మే18(విజన్ ఆంధ్ర): వయోవృద్ధుల ఆదరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యలలో ఒకటి ప్రనామ్ మల్టి సర్వీస్ డే కేర్ సెంటర్ అని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.ప్రభుత్వం సౌజన్యం తో, రెడ్ క్రాస్ సొసైటీ జనగామ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రణామ్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ ను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డే కేర్ నిర్వహణకు ముందుకు వచ్చిన రెడ్ క్రాస్ సొసైటీ జనగామ కార్యవర్గ సభ్యులను కలెక్టర్ అభినందించారు.ఈ సెంటర్ లో వయోవృద్ధులు చదువుకోడానికి వార్త పత్రికలు, వార్తలు చూడటానికి టి వి సౌకర్యం ఉంటుందని అలాగే క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ తదితర ఆటలు ఆడుకునే సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు.చక్కని నూతన భవనంలో సెంటర్ ఏర్పాటు చేసినందుకు అభినందిస్తూ ఇంకా మీకు కావలసిన ఇతర అవసరమైన సౌకర్యాల కోసం తమ దృష్టి కి తీసుకరావాలన్నారు.వయోవృద్ధులకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంతోషంగా ఉండాలని సూచించారు.రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. డి. లవకుమార్ రెడ్డి డే కేర్ సెంటర్ పనివిధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కన్న పరశురాములు,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మల్లికార్జున రావు, రెడ్ క్రాస్ సొసైటీ నాయకులు డా. ఎల్. లక్ష్మీనారాయణ నాయక్, అల్లాడి ప్రభాకర్ రావు, క్రిష్ణ జీవన్ బజాజ్, జైన రమేష్, రజనీ, క్యాథరిన్, సీనియర్ సిటిజన్స్ సంఘాల నాయకులు తీగల సిద్దిమల్లయ్య, టి. వెంకట మల్లారెడ్డి, రామస్వామి, అంబటి రాజయ్య, దూడల రమేశ్, ఏకనాథ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ తొలగింపు ఆలోచనలు విరమించుకోవాలి

**- జిల్లా అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్**



జనగామ, మే18(విజన్ ఆంధ్ర): ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ తొలగింపుపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్‌ల హక్కులు, గ్రామస్థాయి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జనగామ జిల్లా కలెక్టర్ కి మెమొరాండం అందజేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీల్లో పారదర్శకత, ప్రజాధన పరిరక్షణ మరియు బాధ్యతాయుత పాలన కోసం ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ ఎంతో అవసరమని ఆయన అన్నారు. గతంలో గ్రామపంచాయతీల్లో ఏకపక్ష నిర్ణయాలు, పారదర్శకత లోపించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకే ప్రభుత్వం ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ కల్పించిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ అధికారాలను తొలగించే ప్రయత్నాలు చేయడం గ్రామస్థాయి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే కాకుండా, మళ్లీ అవినీతికి అవకాశాలు కల్పించే ప్రమాదం ఉందన్నారు.ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఐక్యంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల విశ్వాసం మరియు పారదర్శక పాలన కొనసాగాలంటే ఉప సర్పంచ్‌ల హక్కులు యథాతథంగా కొనసాగాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్‌లు కే రాజు యాదవ్, కూర శంకర్ నాయక్, జోగు అనిల్, చెలివేరు మహేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ నిరంతరాయ తాగునీరు అందించాలి

**- ఫీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి**



బోడుప్పల్,మే18(విజన్ ఆంధ్ర): మేడిపల్లి, పీర్జాదిగూడ పరిధిలోని పలు కాలనీలలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీజీఎం డీజీఎం సరిత లను ఉప్పల్ జోన్ హెచ్ఎండబ్ల్యూఎస్ కార్యాలయం లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడిపల్లి,పీర్జాదిగూడ డివిజన్లలోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రధాన సమస్యలైన మేడిపల్లిలో ఉన్న రెండు భారీ రిజర్వాయర్ ట్యాంకులను పూర్తిగా నింపి, ప్రతి ఇంటికీ నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో జరుగుతున్న నీటి లీకేజీలను అరికట్టాలని, కాలం చెల్లిన పాత పైప్‌లైన్ల స్థానంలో నూతన పైప్‌లైన్లను రీప్లేస్ చేయాలని కోరారు. తాగునీటి సౌకర్యం లేని పలు కాలనీలను గుర్తించి, అక్కడ కొత్తగా తాగునీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో సోమయ్య, బర్రె నాగరాజు,పద్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి.



ములుగు మే 18; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు కొత్తగా వచ్చిన ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ భోర్ఖడే ను మర్యాద పూర్వకంగా కలసి గట్టమ్మ అడ్వకేట్ సొసైటీ తరపున ములుగు జిల్లా న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు మంజూరు చెయ్యాలని వినతి పత్రం అందించగా సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాలుగు చంద్రయ్య, ఉపాధ్యక్షులు రంగోజు బిక్షపతి, గట్టమ్మ అడ్వకేట్స్ సొసైటీ అధ్యక్షులు మేకల మహేందర్,కోశాధికారి బానోత్ స్వామిదాస్, సంయుక్త కార్యదర్శి రాచర్ల రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరి గా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. సోమవారము కల్లెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన "ప్రజావాణి" కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. ఆర్ డి ఓ తహసిల్దార్ ల పరిదిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని , ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాశించారు. ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు , రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం,ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా 151 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి,అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ . జడ్ పి సి ఇ ఓ సుధీర్, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 99 డేస్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5ఖ రన్



భూపాలపల్లి జిల్లా : 18 మే ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో 99 డేస్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5ఖ రన్(భూపాలపల్లి హనుమాన్ టెంపుల్ దగ్గర నుండి కృష్ణా కాలనీ అంబేద్కర్ (గ్రౌండ్ వరకు) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వాన్ని, ఆలోచనా శక్తిని అభివృద్ధి చేస్తాయని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, పోటీ తత్వం పెంపొందుతాయని, యువత ప్రతి రోజూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ యువత ప్రతిభను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా క్రీడల అధికారి, డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్నాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యము

**- యువజన క్రీడా అధికారి మహమ్మద్ సత్తార్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 ( విజన్ ఆంధ్ర ) : వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసికంగా, శరీరకంగా దృడంగా ఉంటారని యువజన క్రీడా అధికారి మహమ్మద్ సత్తార్ తెలిపారు. సోమవారము 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల వారోత్సవాల సందర్భంగా.. జిల్లా యువజన,క్రీడా శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా బ్లాక్ గ్రౌండ్ నుండి ఎన్నెపల్లి చౌరస్తా వరకు నిర్వహించిన 2కే రన్ ను జెండా ఊపి ప్రారంభించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ ప్రక్రియలను చేయడం వల్ల శారీరక, మానసిక దృఢత్వాన్ని పరీక్షించే ఒక గొప్ప క్రీడాంశమని తెలిపారు .స్ట్రాటజీ, వేగం, ఎనర్జీని ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలో తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు మనకు చాలా ఉపయోగపడతాయని , క్రమశిక్షణ, ఓర్పును పెంపొందు తాయాన్నారు.గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించి, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడమే కాకుండా,మానసిక ఒత్తిడిని తగ్గించి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు . ఈ రన్ లో వివిధ శాఖల కు చెందిన జిల్లా స్థాయి అధికారులు,యువత, క్రీడాకారులు, విద్యార్థులు, వాకర్స్ పి ఇ టి లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'పానీ హో తో క్లియర్' ప్రచారం ప్రారంభించిన క్లియర్ వాటర్

హైదరాబాద్, మే 18 (విజన్ ఆంధ్ర) : క్లియర్ ప్రీమియం వాటర్ తన ప్రతిష్టాత్మక 'పానీ హో తో క్లియర్' ప్రచారాన్ని ప్రారంభించినట్లు క్లియర్ ప్రీమియం వాటర్ వ్యవస్థాపకుడు, సీఈఓ నయన్ షా సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతీయ వినియోగదారులను అసలైన దానిని ఎంచుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ప్రచారంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. బ్రాండ్ అంబాసిడర్ హృతిక్ రోషన్ నటించిన ఈ కొత్త టీవీసీ హాస్యం, సాంస్కృతిక జ్ఞాపకాలు, స్పష్టమైన సందేశంతో భారత దేశంలోని నకిలీ నీటి మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. క్లియర్ వాటర్ గత మూడేళ్లుగా మార్కెట్ లో నాణ్యతతో కూడిన నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలిపారు. వినియోగ దారులకు సురక్షితమైన తాగునీటిని అందిస్తూ, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 18,(విజన్ ఆంధ్ర ) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి, భీమారం లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో



పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు.భీమారం మండలం అంకుశపూర్, నస్పూర్ మండల కేంద్రంలో గల రైస్ మిల్లులను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియ పరిశీలించారు. రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 18,(విజన్ ఆంధ్ర ) :ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్–ఫిజికల్ లీటరసి కార్యక్రమంలో డి సి పి భాస్కర్, గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎ. సి. పి. ప్రకాష్, యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశం యువ భారతదేశం అని, దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని, దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం, యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. "నో టు డ్రగ్స్ – ఎస్ టు ఎక్సర్సైజ్" నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక రుగ్మత, మానసిక ఆందోళనల నుంచి బయటపడవచ్చు అని, అనారోగ్యం దరిచేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక, చారిత్రక, పరిశోధన కేంద్రంగా మూడ్ మల్ నిలువు రాళ్ళు

**-నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది.**

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**

మాగనూర్ మే 18 (విజన్ ఆంధ్ర) : ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణమని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమల్ నిలువు రాళ్ల (మెన్హిర్స్) ను ఆమె సందర్శించారు. నిలువు రాళ్లు, సప్తర్షి



మండలంతో ఖగోళ పరిజ్ఞానాన్ని, కాలాలను, వాతావరణ మార్పులను ఆనాడే తెలుసుకునేవారని, కాలాలను గుర్తించడానికి ఆది మానవులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్లు ఆర్కియాలజీ శాఖకు చెందిన అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఎలాంటి సాంకేతికత లేని 4 వేల సంవత్సరాల క్రితమే రాళ్ల ద్వారా తెలుసుకోవడం అనేది ఆబ్బురపరిచేలా, అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు యువజన క్రీడా,పర్యాటక వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆమె సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కు సంబంధించిన వారోత్సవాల టూరిస్ట్ గైడ్ పోస్టర్ తో పాటు మూడ్ మల్ నిలువు రాళ్ళ విశిష్టత ను తెలిపే ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీ ఆర్ వో రషీద్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్ శెట్టి, మూడ్ మల్ సర్పంచి, పురావస్తు శాఖ అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం రూ,18 వేలు చెల్లించాలి

**- సీఐటీయు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి సురేఖకు వినతిపత్రం అందజేత**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 18,(విజన్ ఆంధ్ర ) ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సతీమణి సురేఖ కు ఆశా వర్కర్ల సమస్యలపై సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్లు గత ఇరవై సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారన్నారు. నేటికి వీరికి ఎలాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,కనీసం గ్యారెంటీ వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం చేయలేదని,ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు 15 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిందని, అయినా నేటికి వేతనాలు పెంచలేదన్నారు. ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉన్నాయని, కావున పై సమస్యలు ప్రభుత్వం తో పరిశీలించి, ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు సంకె రవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభ, ఆశా జిల్లా కమిటీ సభ్యురాలు సువర్ణ, సీఐటీయూ నాయకులు కస్తూరి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**

నిజామాబాద్, మే 18 :( విజన్ ఆంధ్ర ) ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే జిల్లాలో ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేయడం జరుగుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల అతిక్రమణను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖల ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. పర్యావరణ అనుమతులు లభించిన తరువాతే పోతంగల్ మండలం హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది నుండి ఇసుక రవాణాకు అనుమతించడం జరిగిందని తెలిపారు. టీజీఎండీసీ ద్వారా నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఇసుక రవాణా



కొనసాగుతోందని, తన ఆదేశాల మేరకు బోధన్ ఆర్.డీ.ఓ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి ఈ మేరకు నివేదిక అందించారని అన్నారు. వే బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతోందని, ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకే ఇసుక వాహనాలకు అనుమతిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. టీజీఎండీసీ ద్వారా కొనసాగుతున్న కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతోందని, తూకంలో తేడా లేకుండా, ఓవర్ లోడ్ కు ఆస్కారం లేకుండా సీసీ కెమెరా ద్వారా నిఘా ఏర్పాటు చేశామని, జీ.పీ.ఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ఇసుక లోడ్ తో కూడిన వాహనం ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్తోంది అన్నది ఆన్లైన్ లో టీజీఎండీసీ ప్రధాన కార్యాలయంలో గమనించడం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని మిగతా ఇసుక రీచ్ ల నుండి మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా ట్రాక్టర్లలో ఇసుక రవాణాకు అనుమతించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులను సమన్వయము చేసి విస్తృత తనిఖీలు జరిపిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పారదర్శకంగా జరుగుతోందని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నీతి అయోగ్ ద్వారా అకాక్షింత జిల్లా కార్యక్రమములో భాగంగా మౌళిక వసతులు కల్పనకు చర్యలు...

- కలెక్టర్ కె హరిత ..

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 విజన్ ఆంధ్ర నీతి అయోగ్ ద్వారా సంపూర్ణత అభియాన్ లో భాగంగా అకాక్షింత జిల్లా కార్యక్రమములో జిల్లాలో మౌళిక వసతులకు కల్పనకు చర్యలు తీసుకుంటునట్లు కలెక్టర్ కె హరిత అన్నారు సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేశ రాజధాని న్యూ డిల్లి లోని నీతి అయోగ్ కార్యాలయం నుండి నీతి అయోగ్ సి ఈ వో నీతి చిబ్బార్ గారు ఇతర ఉన్నత అధికారులతో కలిసి దేశంలోని అకాంక్షిత జిల్లా అకాక్షింత బ్లాక్ లో నీతి అయోగ్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు మౌళిక వసతుల కల్పన ఎంపవర్మెంట్ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ కె హరిత పాల్గొన్నారు ఈ




సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ ద్వారా అకాక్షింత జిల్లా కార్యక్రమము, అకాక్షింత బ్లాక్ కార్యక్రమము లో భాగంగా మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటూన్నామన్నారు తిర్యాని మండలంలో ఆర్ట్ విలేజ్ మరియు లైబ్రరి ప్రాజెక్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటూన్నామన్నారు ఈ కార్యక్రమములో డి వై ఎస్ ఓ వెంకటేశ్వర్లు అకాక్షింత మండల సమన్వయ కర్త బాలరాజు రాజారామ్ పాల్గొన్నారు.

# ఎంపీ వంశీకృష్ణ కు కృతజ్ఞతలు తెలిపిన నేతకాని (మహర్ )సేవా సంఘం

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 18,(విజన్ ఆంధ్ర ) : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు నేతకాని (మహార్) సేవా సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం స్వామి తెలిపారు. నేత కాని సేవా సంఘం భవనంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు తమకు రాష్ట్రంలో కమిటీ భవనం లేదని తొలిసారిగా మంచిర్యాల పట్టణంలోని 100 ఫీట్ల రోడ్డుకు ఆనుకొని కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టడం సంతోషించేదగ్గ విషయం అన్నారు. భవన నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయల నిధుల తో భవన నిర్మాణం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.గదుల నిర్మాణానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గత ఏడాది 50 లక్షలు ఈ ఆర్థిక సంవత్సరంలో 50 లక్షల రూపాయలు కేటాయించారని తెలిపారు. పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించిన ఎంపీ వంశీకృష్ణ కు నేతకాని సేవా సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు కొనసాగిన కమిటీ పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షులు కుమ్మరి మల్లయ్య, జనగామ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జనగామ తిరుపతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం రాజయ్య, జుమ్మిడి రాజేష్,చరణ్ దాస్, అన్నారవు, జాడి ప్రమీల,జాడి మాధవి, జాడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**- వికారాబాద్ అసెంబ్లీ బిజెపి కోఆర్డినేటర్ దిశ కమిటీ మెంబర్ వడ్ల నందు**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పంపిన లేఖను జిల్లా కలెక్టర్ కు అందజేశానని వికారాబాద్ అసెంబ్లీ బిజెపి కోఆర్డినేటర్ దిశా కమిటీ మెంబర్ వడ్ల నందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ ఆలస్యంతో రైతులు తమ పంటను సరైన ధరలకు విక్రయించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ నష్టపోయే పరిస్థితుల్లో అమ్మకాలకు దిగవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదిలాబాద్ వంటి జిల్లాలలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కొనుగోలు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిసింది. అక్కడి రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను మార్కెట్ చేయగలుగుతున్నారు. వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నాను. సమయానుకూల జోక్యం రైతులకు ఎంతో మేలు చేసి వారి ప్రయోజనాలను కాపాడుతుంది. ఈ కార్యక్రమంలో రొంపల్లి సర్పంచ్ శ్రీనివాస్ మాజీ ఎంపిటీసీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి.

**- ప్రణాళిక బద్ధంగా చదువుకుంటే చదివితే మంచి సాధించవచ్చు.**

**- నారాయణపేట కలెక్టర్ సిహెచ్ ప్రియాంక.**



నారాయణపేట, మే 18 (విజన్ ఆంధ్ర ) : విద్యార్థులుఉన్నతలక్ష్యంతో చదివితే జీవితంలో స్థిరపడతారని నారాయణపేట కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం దామరగిద్ద మండల పరిధిలోని విట్లాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించడంతో ప్రశంస పత్రం నగదు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదువుకుంటే జీవితంలో ఉన్న స్థాయికి ఎదుగుతారని కృషి పట్టుదల తో ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని బి శైలజ, అక్షిత లను అభినందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధనలు చేపడుతూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామనిఅన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు ప్రధానోపాధ్యాయులు జి నాగిరెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు ఆశన్న సత్యనారాయణ రెడ్డి జగదీష్ వెంకటేశ్వర్లు పిడి వేణుగోపాల్ పాల్గొన్నారు. విద్యార్థులను అభినందించిన ప్రజాప్రతినిధులు. పదో తరగతిలో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిన బి శైలజ, ఎల్ అక్షిత కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం నగదు అందుకోవడంతో విట్లాపూర్ సర్పంచ్ హనుమంతు, ఉప సర్పంచ్ వీరమని అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వెంకటమ్మ అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# నూతన పీ హెచ్ సీ ని పరిశీలించిన కలెక్టర్

మాగనూర్ మే 18 (విజన్ ఆంధ్ర) :నారాయణ పేట జిల్లా కృష్ణా మండల కేంద్రంలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ. కోటి 43 లక్షల తో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక పరిశీలించారు. కేంద్రంలోని వివిధ విభాగాల గదులను చూశారు. ఇంత వరకు కృష్ణా మండలానికి పీ హెచ్ సీ లేదా అని ప్రశ్నించగా కృష్ణా మండలం కొత్తగా ఏర్పడిందని, గతంలో మాగనూరు పీ హెచ్ సీ లోనే కృష్ణ మండలానికి చెందిన ప్రజలు సేవలు పొందేవారని, ఇప్పుడు కొత్తగా నిర్మించిన పీ హెచ్ సీ అందుబాటులోకి రానుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ కలెక్టర్ కు తెలిపారు. నూతన పీ హెచ్ సీ లో ఇంకా ఏమైనా పనులు మిగిలి పోయాయా? అని కలెక్టర్ అడగడంతో



.. పనులన్నీ పూర్తయ్యాయని డీ ఎం అండ్ హెచ్ ఓ తెలిపారు. అయితే జూన్ 2 న నూతన పీ హెచ్ సీ ప్రారంభోత్సవానికి జిల్లా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సమయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ తహాసిల్దార్ శ్రీనివాస్, డిపివో బిక్షపతి, కృష్ణా గ్రామ సర్పంచి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ సర్కిల్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

**- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

బోడుప్పల్,మే18,(విజన్ ఆంధ్ర): బోడుప్పల్ సర్కిల్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కేషి చేయాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల, బోడుప్పల్ ప్రాంత సమస్యలపై మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మేడ్చల్ జిల్లా బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తో కలిసి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డిని కలిశారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా కమిషనర్ తో పలు అంశాలపై



సుదీర్ఘంగా చర్చించారు.ఈ మేరకు వారు చెంగిచెర్ల,బోడుప్పల్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై చర్చించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) మే 18 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మే 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించనున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా, నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అమరేందర్ జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అవగాహన గోడపత్రికనుఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ..., పర్యాటక రంగం జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పర్యాటక కేంద్రాలను గుర్తించి వాటిని మరింత అభివృద్ధి చేయడం ద్వారా జిల్లాకు కొత్త గుర్తింపు తీసుకురావచ్చని, పర్యాటక వారోత్సవాలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, ప్రజల్లో పర్యాటక అవగాహన పెంపొందించే ఒక సమగ్ర ఉద్యమంగా మారాలని జిల్లా కలెక్టర్ సూచించారు.యువతను పర్యాటక రంగంలో భాగస్వామ్యం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని, పర్యాటక ప్రదేశాల శుభ్రత, సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా నాగర్ కర్నూల్ జిల్లా కృష్ణ నది తీరక ప్రాంతంలో సోమశిల, సోమశిల టెంపుల్, మరియు మల్లేశ్వరం హైలాండ్, నల్లమల్ల అటవీ ప్రాంతం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి సమన్వయ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు జరిగే రోజు వారి కార్యక్రమాల వివరాలను జిల్లా అధికారులకు వివరించారు. 18వ తేదిన యువ పర్యాటక క్లబ్స్ ప్రారంభంపర్యాటక వారోత్సవాల ప్రారంభ దినోత్సవంగా యువ పర్యాటక క్లబ్స్ కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్ విడుదల చేయనున్నారు. విద్యార్థులు, యువతలో పర్యాటక అవగాహన పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం ప్రారంభించబడుతుంది. 19వ తేదీన పర్యాటక




అవగాహన ర్యాలీ & కార్యక్రమంకృష్ణా నది పరివాహక ప్రాంతం, సోమశిల ప్రాంతాల్లో పర్యాటక అవగాహన డ్రైవ్ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో పర్యాటక ప్రాధాన్యం, స్థానిక ప్రదేశాల విలువ, మరియు పర్యాటకుల బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించబడుతుంది. 20వ తేదీన స్వచ్ఛత కార్యక్రమం సోమశిల టెంపుల్పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పర్యాటక కేంద్రాలను శుభ్రంగా ఉంచడం, పర్యావరణ పరిరక్షణ, మరియు ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు పై ప్రత్యేక దృష్టి సారించబడుతుంది. స్థానిక ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొననున్నారు.21వ తేదీన వారసత్వ నడక (Heritage Walk) .సోమశిల టెంపుల్ పరిసరాల్లో వారసత్వ నడక (Heritage Walk)కార్యక్రమంనిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ చరిత్ర, ఆలయ ప్రాధాన్యం, సాంస్కృతిక వారసత్వం గురించి పర్యాటకులకు మరియు యువతకు వివరించనున్నారు. 22వ తేదీన పర్యాటక ఇన్‌ఫ్లూయెన్సర్లు , యూట్యూబర్ల సమావేశం మల్లేశం ఐలాండ్ ప్రదేశంలో స్థానిక పర్యాటక ఇన్‌ఫ్లూయెన్సర్లు, యూట్యూబర్లు, ట్రావెల్ బ్లాగర్లు పాల్గొనే ప్రత్యేక సమావేశాన్నినిర్వహించనున్నారు.డిజిటల్ మీడియా ద్వారా తెలంగాణ పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం. 23వ తేదీన బ్రాండ్ కిట్ పోస్టర్ విడుదల & ముగింపు కార్యక్రమం పర్యాటక వారోత్సవాల ముగింపు కార్యక్రమంగా IDOC, నాగర్‌కర్నూల్ లో బ్రాండ్ కిట్ పోస్టర్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా వారోత్సవాల ఫలితాలు, భవిష్యత్ ప్రణాళికలు, మరియు పర్యాటక అభివృద్ధి వ్యూహాలపైచర్చించబడుతుంది.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ, జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి సీతారామ్ నాయక్,డిపిఅర్ఓ కిరణ్ కుమార్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం ఉండకూడదు,

**- ఇందిరమ్మ గృహ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి,**

**- తూడుకుర్తిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన,**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): మే 18 మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న గృహ నిర్మాణాల పురోగతి, నాణ్యత ప్రమాణాలు మరియు లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలపై అధికారులు, లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారురాలు గుబ్బల హేమలతకు మంజూరైన ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి నిర్మాణ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే గృహప్రవేశానికి సిద్ధం చేయాలని ఆమెకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేసుకోవాలని తెలిపారు.గ్రామంలో మంజూరైన ఎల్3 కేటగిరీకి చెందిన మూడు ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై ఇంజినీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణ పనుల నాణ్యత, పనుల వేగం, అవసరమైన సాంకేతిక సదుపాయాలు, పరిపాలనా అంశాలను కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఎక్కడైనా పనులు నిలిచిపోయిన పరిస్థితులు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ



ఇండ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, నిధుల విడుదల వంటి అంశాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి కొరత, నిధుల విడుదలలో ఆలస్యం వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసి లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇండ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బలమైన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకొని నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట మండల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ఊట్కూర్ పెద్దచెరువువిస్తరణతో మాగ్రామానికిముప్పు.

**- పేట రెవెన్యూ అదనపు కలెక్టర్ కు అఖిల పక్షం నాయకుల వినతి.**

**- ఊట్కూర్ ప్రభావితప్రాంతంగా గుర్తించిపునరావాసంకల్పించండి.**

ఊట్కూర్, మే 18 ( విజన్ ఆంధ్ర) : మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకం పథకంలో భాగంగా ఊట్కూర్ పెద్ద చెరువు రిజర్వాయర్ గా మారుస్తున్న నేపథ్యంలో చెరువు విస్తరణతో గ్రామానికి ముంపు పొంచిఉందని ఊట్కూర్ ప్రభావిత ప్రాంతాన్ని గుర్తించి పునరావాసం కల్పించాలని నారాయణపేట రెవెన్యూఅదనపుకలెక్టర్ శ్రీనుకు సోమవారం ప్రజావాణిలో ఊట్కూర్ అఖిలపక్షం నాయకులు కలిసివినతిపత్రంసమర్పించారు. జీవో 69 మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూర్ పెద్ద చెరువు సామర్థ్యాన్ని 800 ఎకరాల నుంచి 19000 వేల ఎకరాలకు పెంచే ప్రతిపాదనపై ఊట్కూర్ గ్రామ అఖిలపక్ష కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రాజెక్టువల్ల గ్రామానికి ఊటనీటిముప్పు మరింత పెరిగి వందలాది ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాలు, మసీదులు, స్మశానవాటికలు ప్రమాదాలకు గురికానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఊట్కూర్ మండల కేంద్రంలోని చెరువు సమీపంలో ఉన్న




కాలనీలలో కొద్దిపాటి వర్షాలకు పిల్ల పునాదుల నుండి ఊటనీరు ఊబికి వస్తుందని ప్రాజెక్టు నిర్మాణం చేపడితే చెరువులో నీటి సామర్థ్యం పెరిగి ఊట ప్రభావం మరింత పెరగడంతోపాటు గ్రామం సగభాగం జలమయ మయ్యే ప్రమాదంఉందన్నారు.

చెరువులో నిరంతరం భారీగా నీరు నిల్వ ఉండడం వల్ల ఊటనీటి ప్రభావం వంద రెట్లు పెరిగే అవకాశం ఉందని, దీంతో గ్రామ ప్రజల ప్రాణాలు, ఆస్తులు, జీవనోపాధి ప్రమాదంలో పడతాయని కమిటీ సభ్యులు వినతి పత్రంలో ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు చుట్టుపక్కల ఉన్న వందల ఎకరాల సాగుభూములు చిత్తడిగా మారి పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, సామాజికపర్యావరణ ప్రభావ నివేదికలను ప్రజలకు వెల్లడించకపోవడం, గ్రామసభలు నిర్వహించకపోవడం వంటి పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.భూసేకరణ పునరావాస చట్టం2013 ప్రకారం ప్రభావిత ప్రాంతాలను ముందుగానే సర్వే చేసి గుర్తించాలని, బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయి ఆర్ అండ్ ఆర్ పునరావాస కాలనీ ఏర్పాటు చేసి ఉచిత ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, గరిష్ట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఊటనీటి నివారణకు చెరువు కట్ట వద్ద సీపేజ్ కటాఫ్ వాల్, టో డ్రెయిన్ నిర్మాణాన్ని ప్రభుత్వ ఖర్చుతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై స్పష్టమైన సాంకేతిక హామీ పునరావాస భరోసా ఇచ్చే వరకు ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు రమేష్, భరత్, ఇబాదూర్ రెహమాన్, ఆనంద్ రెడ్డి, భరత్ కుమార్, ప్రకాష్, సమీ, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల నడ్డి విరుస్తున్న నరేంద్ర మోడీ పాలన

**- ధరలు తగ్గించే వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతాయి**

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్,**

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) మే 16 : దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను నిరంతరం పెంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతోందని సీపీఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్తీవ్రంగావిమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిర్వహించిన నాగర్ కర్నూల్ జిల్లాలో రాష్ట్ర రోకో మరియు నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రజల రక్తాన్ని పిండి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల కేవలం వాహనదారులకే కాదు, సామాన్య ప్రజల జీవితమంతా తీవ్ర ప్రభావానికి గురవుతోందన్నారు. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పేద, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు



వ్యవసాయ ఖర్చులు పెరిగి పంటలు సాగు చేయడం భారంగా మారిందన్నారు. ఆటో కార్మికులు, చిన్నవ్యాపారులు, కూలీలు, ఉద్యోగులు అందరూ ఈ ధరల పెంపుతో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా ప్రజలకు ఎలాంటి ఉపశమనం ఇవ్వకుండా ఎక్సైజ్ సుంకాలు పెంచుతూ ప్రజలను దోచుకుంటోందని ఫయాజ్ ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై భారీ పన్నులు విధించి ప్రజల శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యంగా మారిందన్నారు. "ప్రజల బాధలు పట్టని మోడీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ పాలన వైపు నెడుతోంది. ఒకవైపు నిరుద్యోగం, మరోవైపు ధరలపెరుగుదలతో ప్రజలు తీవ్ర సంక్షోభంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రచార రాజకీయాల్లో మునిగిపోయింది" అని విమర్శించారు. సీపీఐ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇంధన ధరలపై విధిస్తున్న అధిక పన్నులను రద్దు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా,దేశవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్ ఆనంద్ జి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్యాద వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ నాగర్కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి, ఎండి సయ్యద్ కాజా, ఈర్ల భూపేష్, వంకేశ్వరం శ్రీను, కొత్త రామస్వామి, ఎండి కాజా, రామచంద్రమ్మ, జి రామకృష్ణ, సత్యం,విజయ్,వెంకటస్వామి, శివ, చెన్నయ్య, సుధాకర్, కొత్తకోట కర్రన్న, బజ్జన్న, సీతయ్య, శివయ్య యాదమొని, మరియు తదితులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వృద్ధుల వద్దకు స్వయంగా వెళ్లిన కలెక్టర్

**- వృద్ధుల సమస్యల పరిష్కారానికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు,**

**- నేటి ప్రజావాణికి 35 దరఖాస్తులు,**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) మే 18 : కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. అమరేందర్, తో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో, తమ పిల్లలు ఆస్తులను తీసుకుని ఇప్పుడు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రజావాణికి వచ్చిన వృద్ధుల వద్దకు స్వయంగా వెళ్లి వారి వినతి పత్రాలను స్వీకరించారు.వృద్ధుల సమస్యలను ఓర్పుగా, శ్రద్ధగా విన్న కలెక్టర్, వారికి ధైర్యం చెప్పారు. సమస్యను సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల పట్ల



కలెక్టర్ చూపిన ఆప్యాయత, స్పందన అక్కడున్న వారిని కదిలించింది. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మానవీయ దృక్పథంతోవ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, మాట్లాడుతూ. జిల్లా అధికారులు తప్పకుండా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని, ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి తమ సమస్యలను వినిపిస్తూ ఫిర్యాదులు సమర్పిస్తున్నందున ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. అలాగే తిరస్కరణకు గురైన దరఖాస్తులపై తప్పనిసరిగా స్పష్టమైన రిమార్కులు నమోదు చేయాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు అందాయని తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తుపై ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు పంపించిన కలెక్టర్, ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, దీంతో పాటు రాష్ట్ర స్థాయి నుంచి వచ్చే ప్రతి ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వాటిని ఎక్కడ కూడా పెండింగ్లో ఉంచకుండా వెనువెంటనే పరిష్కరించాలని.. అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కళా కల కోసం కాదు... ప్రజల చైతన్యం కోసం

**- మేడిపల్లి మండల సీపీఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్**

**- ప్రజానాట్యమండలి మహాసభలను జయప్రదం చేయాలి**

**- బోడుప్పల్ సర్కిల్ లో గోడపత్రికను విడుదల చేసిన సీపీఐ నాయకులు**

బోడుప్పల్, మే 18 (విజన్ ఆంధ్ర): కళా కల కోసం కాదు... ప్రజల చైతన్యం కోసమని కళాకారులు పెద్ద ఎత్తున్న పాల్గోని ప్రజానాట్యమండలి మహాసభలను విజయవంతం చేయాలని మేడిపల్లి మండల సీపీఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ తెలిపారు.తెలంగాణ ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా 4వ మహాసభలను పురస్కరించుకొని సోమవారం బోడుప్పల్ సర్కిల్ ఇందిరానగర్ చౌరస్తాలో మేడ్చల్ జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి కే ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడిపల్లి మండల సీపీఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ హాజరై గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కే ప్రమీల మాట్లాడుతూ "కళా కళ కోసం కాదుడ కళ ప్రజల కోసం, ప్రజా చైతన్యం కోసం" అనే నినాదంతో ప్రజానాట్యమండలి దేశవ్యాప్తంగా కళాకారులను సమీకరించి స్వాతంత్ర్యోద్యమం నుంచి తెలంగాణ సాయుధ పోరాటం వరకు ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి తెలుగు సాంస్కృతిక రంగంలో ప్రత్యేక ముద్ర వేసిందని, ప్రజల



నిత్యజీవిత సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని వివిధ కళారూపాల ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించిందన్నారు. మాభూమి, ముందడుగు, పరివర్తన, సామాజిక తెలంగాణ వంటి నాటకాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించిందని తెలిపారు. బుర్రకథ, ఒగ్గుకథ, పల్లెసుద్దులు, వీధి నాటకాల వంటి జానపద కళారూపాలను ప్రజానాట్యమండలి పునరుజ్జీవింపజేసిందని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో కళాకారులు లాఠీ దెబ్బలను సైతం ఎదుర్కొంటూ కళారూపాల ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు సిహెచ్ మాధవి, జి నాగరాజు, మండల కౌన్సిల్ సభ్యులు కే మహాలక్ష్మి, రమాతార, సైదమ్మ, బాపురాజు,మేడ్చల్ జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎండి అన్వర్, ఇస్తారి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# అడవి మంటలపై నిర్వహించిన మాక్ డ్రిల్ ను పరిశీలించిన.

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**




ములుగు మే 18; విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం: ములుగు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అడవి మంటల మాక్ డ్రిల్ ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా తో కలిసి మాక్ డ్రిల్ తీరును పరిశీలించి 39వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్ ఠాకూర్ మాక్ డ్రిల్ కు పరిశీలకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అడవి మంటలు సంభవించడానికి గల కారణాలు, వాటిని నివారించే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడవి మంటల వల్ల వన్యప్రాణులు, అటవీ సంపద, పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ఎవరు కూడా ఎట్టి పరిస్థితుల్లో అడవికి నిప్పు అంటించరాదని ఉద్దేశపూర్వకంగా అటవీ ప్రాంతానికి హాని కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విన్యాసంలో భాగంగా సిబ్బంది అడవి మంటలను సురక్షితంగా అదుపు చేసే విధానాలను అడవి ప్రత్యక్షంగా ప్రదర్శించారు. క్విక్ రెస్పాన్స్ టీం బ్లోయర్స్, రేకర్స్, బీటర్స్, ఫైర్ రేక్ వంటి అగ్నిమాపక పరికరాల వినియోగాన్ని వివరించింది. మంటలు వ్యాపించకుండా కౌంటర్ ఫైర్ లైన్లను సృష్టించే విధానాన్ని ప్రదర్శించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తో పర్యాటక రంగానికి సరికొత్త కళ.

**- హెరిటేజ్, పర్యాటక పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్**
**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



ములుగు మే 18;విజన్ ఆంధ్ర ప్రతినిధి: 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో పర్యాటక శాఖకు సంబంధించిన బ్రోచర్, పోస్టర్ల ను ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం లిప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలి లో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తేదీ.20-05-2026 బుదవారం ములుగు మండలంలోని జాకారం శివాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీకి ఆదేశిస్తూ పలు సూచలనలు చేశారు. తేదీ.21-05-2026 గురువారం యూట్యూబర్స్ సోషల్ మీడియా, ఇన్ఫ్లుయెన్సర్స్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారినీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి , డీ పీ ఆర్ ఓ రఫీక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



నిజామాబాద్, మే 18 :(విజన్ ఆంధ్ర )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజా పాలన సభలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిగేలా పరస్పర సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగర్‌కర్నూల్ జిల్లా సర్వోదయ మండల్ మహాసభలు- నూతన కమిటీల ఏకగ్రీవ ఎన్నిక

**- రాష్ట్ర కార్యదర్శి శంకర్ నాయక్**
**- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై గిరి ప్రసాద్.**



నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): మే 18 కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ (ఖుఫీ) భవనంలో నాగర్‌కర్నూల్ జిల్లా సర్వోదయ మండల్ మహాసభలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ మహాసభల అనంతరం, తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. శంకర్ నాయక్, వై. గిరిప్రసాద్ ల సమక్షంలో నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని, అలాగే జిల్లా మహిళా, యువజన సంఘాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1. సర్వోదయ మండల్ జిల్లా నూతన కమిటీ జిల్లా సర్వోదయ మండల్ నూతన అధ్యక్షుడిగా ఎ. నవీన్, ప్రధాన కార్యదర్శిగా ూ. వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గ సభ్యులు గా జిల్లా ప్రతినిధి గా జూపల్లి రాములు ఉపాధ్యక్షులు గా శివశంకర్, చిన్న స్వామి ని ,సహాయ కార్యదర్శులు గా బి. నాగయ్య, ఎన్. రాముయాదవ్, కోశాధికారి గా జగపతి కార్యవర్గ సభ్యులు గా గోపి, పాండయ్య (వీరితో పాటు మరో ఇద్దరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది). సర్వోదయ మండల్ మహిళా సంఘం జిల్లా కమిటీ మహిళా విభాగం బలోపేతానికి గానూ ప్రత్యేక కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలు: ప్రవీణ ఉపాధ్యక్షురాలు: శశికళ కార్యదర్శి: రాణి సహాయ కార్యదర్శి: శివాని సర్వోదయ మండల్ యువజన సంఘం జిల్లా కమిటీ యువతను సర్వోదయ ఉద్యమం వైపు నడిపించేందుకు యువజన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులు: శ్రీనివాసులు జిల్లా కార్యదర్శి: ఎన్. వెంకటేష్ మహాసభలో ముఖ్య తీర్మానాలు: భూదాన్ భూముల రక్షణే ధ్యేయం ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాగర్‌కర్నూల్ జిల్లా సర్వోదయ మండల్ కమిటీ ప్రతినిధులు జిల్లాలోని భూదాన్ భూములపై పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. గాంధేయవాద ఆశయాలకు అనుగుణంగా కింది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నట్లు ప్రకటించారు: 1. భూదాన్ భూముల రక్షణ: రాష్ట్రంలో అన్యాక్రాంతమైన, కబ్జాలకు గురైన భూదాన్ భూములను ప్రభుత్వం వెంటనే స్పందించి రక్షించాలి. 2. భూదాన్ బోర్డు ఏర్పాటు: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 'భూదాన్ బోర్డు'ను తక్షణమే ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి అధికారాలు కల్పించాలి. 3. పేదలకు భూ పంపిణీ: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న భూదాన్ భూములను గుర్తించి, అర్హులైన నిరుపేదలకు చెందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఈ మహాసభలలో సర్వోదయ మండల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన కమిటీలు జిల్లాలో సర్వోదయ ఆశయాల సాధనకు, భూదాన్ భూముల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది.

## ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**
**- బూర్గంపాడులో వివిధ శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహణ**





కొత్తగూడెం బ్యూరో, మే 19(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో సోమవారం ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జూమ్ మీటింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు అప్రమత్తతతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రెస్క్యూ, పునరావాస చర్యలను పరిశీలించారు. ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను లైఫ్ జాకెట్లు, బోట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అంబులెన్స్‌ల ద్వారా పునరావాస కేంద్రాలకు చేర్చడం, బాధితులకు త్రాగునీరు, భోజనం, వైద్య సేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను ప్రదర్శించారు. బూర్గంపాడు ఎస్సీ కాలనీ నుంచి 10 మంది గర్భిణీలు, 45 మంది చిన్నారులు సహా మొత్తం 200 మందిని, 26 పశువులను సురక్షితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ బాధితులకు వైద్య సేవలు, ఆశ్రయం, ఆహారం, త్రాగునీటి సదుపాయాలు కల్పించారు. వివిధ శాఖలు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాయి. ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో సేవలు అందించగా, గజఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. పునరావాస కేంద్రం, వైద్య శిబిరాలు, ఆపరేషన్ సెంటర్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్ బాధితులకు అందిస్తున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పశువైద్య శిబిరాన్ని కూడా పరిశీలించి అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. "గోల్డెన్ అవర్"లో తీసుకునే చర్యలు ప్రాణ రక్షణకు అత్యంత కీలకమని తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, బూర్గంపాడు తహసీల్దార్, ఎంపీడీవో, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

**- విపత్తుల నిర్వహణపై మాక్ ఎక్సర్సైజ్ విజయవంతం.**
**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**





ములుగు మే 18;విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం: రాబోయే వర్షాకాలంలో వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ములుగు జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ నమూనా కసరత్తును జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీస్, ఫైర్, సీఆర్పీఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందాలు అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాయి. ములుగు జిల్లాలో మొదటగా బండారుపల్లి గ్రామ శివారులోని రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తే వరద నీరు వివేకానంద కాలనీ లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి ప్రమాదకర స్థాయిలో చేరే అవకాశం ఉండటంతో, కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించే విధానం, సెర్చ్ అండ్ రెస్క్యూ చేసిన టీజీఎస్‌డీఆర్ఎఫ్, సీఆర్పీఎఫ్ ప్రత్యేక బృందాల మాక్ ఎక్సర్సైజ్ స్థానిక గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఫ్లాష్ అండ్ రెస్క్యూ ఎక్సర్సైజ్‌లో భాగంగా బండారుపల్లి రాళ్లవాగులో వరదల్లో మునిగిపోతున్న వారిని రెస్క్యూ చేసే విధానం, మృతదేహాల రికవరీ, వాగు ఒడ్డుకు చిక్కుకుపోయిన వారిని కాపాడే విధానాన్ని టీజీఎస్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందాలు సాహసోపేతంగా ప్రదర్శించాయి. బండారుపల్లి గ్రామంలోని జ్యోతిరావు పూలే కాలనీలో వరద ప్రవాహంలో గ్రామం పూర్తిగా మునిగిపోయి, స్థానికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఇంటి పైకప్పులపై చిక్కుకున్న వారిని రోప్ ద్వారా తరలించిన విధానం, వారి ధైర్యసాహసాలు స్థానిక ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయి. కృష్ణ కాలనీ, పాల్‌సాబ్‌పల్లి గ్రామాల్లో రెస్క్యూ ఆపరేషన్ మాక్ ఎక్సర్సైజ్, బాధితులను పునరావాస కేంద్రాలకు, మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే విన్యాసాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులు అనుకోకుండా సంభవించే ప్రమాదాలని పేర్కొన్నారు. అతివృష్టి, క్లౌడ్ బస్ట్ వంటి అనుకోని సంఘటనల వల్ల సంభవించే వరదల సమయంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదల సమయంలో చేపట్టవలసిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించడం వల్ల సిబ్బందికి సంసిద్ధత లభిస్తుందని తెలిపారు. ములుగు జిల్లాలో గతంలో జరిగిన ఘటనలను ఆధారంగా చేసుకుని, భవిష్యత్తులో అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాక్ డ్రిల్ నిర్వహించిన తీరు అభినందనీయంగా ఉందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. పూర్తి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమానికి చల్వాయి 5వ బెటాలియన్ డీఎస్పీ టీ.వి. ధర్మారావు, సీఆర్పీఎఫ్ కమాండెంట్ జాంగ్ షేర్ పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, పోలీస్, ఫైర్, వైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సన్నద్ధతను చాటిన మాక్ ఎక్సర్ సైజ్

**- పర్యవేక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**
**- జిల్లా జనరల్ ఆసుపత్రి, రఘునాథ చెరువు ప్రాంతాలలో కొనసాగిన మాక్ డ్రిల్**
**- వాస్తవికతను మరిపించేలా సహాయక చర్యలు**
**- జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులు**
**- డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం**
**- విశేష సేవలు అందించిన ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు**





నిజామాబాద్, మే 18 :(విజన్ ఆంధ్ర )వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాలు విపత్తుల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. విపత్తుల సమయాలలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా కొనసాగాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, విపత్తుల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది కళ్ళకు కట్టినట్టు ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అంబులెన్స్ లు, అగ్నిమాపక శకటాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటిచెబుతూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖిల్లా రఘునాథ చెరువు వద్ద రెండు చోట్ల ఏకకాలంలో విపత్తుల నిర్వహణపై మాక్ ఎక్సర్ సైజ్ జరిపారు. రఘునాథ చెరువు వద్ద జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాలు కురిసి వరద ప్రవాహం కారణంగా చెరువు నీటిలో బాధితులు చిక్కుకున్న సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన తక్షణ చర్యలను వాస్తవిక రూపంలో మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేసి చూపించారు. చెరువులో మునిగిపోతున్న వారిని డ్రోన్ల సహాయంతో గుర్తిస్తూ, బోట్ల ద్వారా ఎస్.డీ.ఆర్.ఎఫ్ సిబ్బంది వారిని కాపాడడం, ఒడ్డుకు చేర్చిన వెంటనే వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స జరిపి అంబులెన్స్ లలో ఆసుపత్రికి తరలించడం వంటి సహాయక చర్యలు అధికార యంత్రాంగం సన్నద్ధతను నిరూపించాయి. సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో రిలీఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, డిచ్పల్లి 7వ పోలీస్ బెటాలియన్ అధికారి సత్యనారాయణ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆంజనేయస్వామి, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఆర్ అండ్ బీ ఈ.ఈ రంజిత్, శివకుమార్ ఇతర అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షించారు. కాగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వరద జలాలు చుట్టుముట్టిన సమయంలో గ్రౌండ్ ఫ్లోర్ లోని పేషెంట్లను హుటాహుటిన పై అంతస్తులకు చేర్చి, వారి ప్రాణాలను ఎలా కాపాడాలి అనే దానిపై మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ఆచరణాత్మక రీతిలో చేసి చూపించారు. నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నాగమోహన్ తదితరులు పర్యవేక్షించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఫిషరీస్, హెల్త్, ట్రాన్స్పోర్ట్ తదితర అన్ని శాఖలు చక్కటి సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్ సైజ్ ను విజయవంతం చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తూ, ముందస్తుగానే పక్కా పర్యవేక్షణతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం జరిగిందన్నారు. ఆకస్మిక వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలోనూ వాటిని ధైర్యంగా ఎదుర్కొంటారనే నమ్మకాన్ని మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా కలిగించడం జరిగిందన్నారు. విపత్తుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం జరుగుతుందని, ప్రకృతి వైపరీత్యాలు, కుంభవృష్టి వర్షాలు కురిసిన సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించేందుకు మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధిని విస్మరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**- మహేష్ కుమార్ గౌడ్ రాజకీయ భవిష్యత్తును ఖతం చేసే కుట్ర.**
**- మీడియా సమావేశంలో ఎంపీ అరవింద్.**



నిజామాబాద్ మే18:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్ పంగానామలు పెడుతున్నాడని ఎంపీ అరవింద్ ఎద్దేవా చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ గడ్డమీద ఔటర్ రింగ్ రోడ్డు కు హామీ ఇచ్చి మర్చిపోయారని ఆరోపించారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్డుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి తుంగలో తొక్కారని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్ల లోనూ కేంద్రం వాటా ఉంటుందని ఈ సందర్భంగా ఎంపి అరవింద్ గుర్తు చేశారు. జిల్లా కు చెందిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ ను రేవంత్ రాజకీయంగా ఖతం చేసేందుకే జిల్లా అభివృద్ధిని మర్చిపోయారని ఆరోపించారు. జిల్లా అబివృద్ది కి నిదుల కోసం వంద కార్లతో వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని అందుకోసం సీఎం అపాయింట్మెంట్ తీసుకోవాలని ఎమ్మెల్యే దన్ పాల్ కు సూచించారు. 2034 వరకు నేనే సీఎం అంటూ రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎంపీ అన్నారు. సీఎం రేవంత్ ది పరిపాలించే వ్యక్తిత్వం కాదని పేకాట గ్యాంగ్ గా ఎంపీ అరవింద్ అభివర్ణించారు. 2039 దాకా రాహుల్ ప్రధాని కాలేదని రేవంత్ స్వయంగా చెప్పారని అది కూడా తన సహకారం లేకుండా రాహుల్ ప్రధాని కాలేదని రేవంత్ చెప్పుకోవడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. దీనిని బట్టి రాష్ట్ర రాజకీయాలను వదిలి రేవంత్ రెడ్డి జాతీయ రాజకీయాలకు వెళ్ళిపోతాడన్నది స్పష్టం అవుతుందన్నారు. రేవంత్ రెడ్డి మాటలను బట్టి కేంద్రంలో మరో పదేళ్లు బీజేపీ సర్కార్ ఉంటుందని స్పష్టమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ కు ఘోర పరాజయం తప్పదని ఎంపీ అరవింద్ జోస్యం చెప్పారు. పసుపు బోర్డు భూమి కోసం ఉద్యమిస్తామని ఎంపీ అరవింద్ హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ దే అధికారమని ఎంపీ అరవింద్ అన్నారు. రేవంత్ రెడ్డి మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాభవాన్ని ఎదుర్కొంటుందని అన్నారు. జగిత్యాలలో తాను చేపట్టిన ధర్మదీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం అక్కడి ఎస్పీ కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించడమే కారణమన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే ను రాజకీయంగా భూస్థాపితం చేయడమే తన ముందున్న ఏకైక లక్ష్యమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంతవరకు నిజామాబాద్ జిల్లాకు ఔటర్ రింగ్ రోడ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగానే ఉంటాయన్నారు. దీనికోసం పది రోజుల్లో పెద్ద ఎత్తున హైదరాబాద్ వెళ్లి సీఎం రేవంత్ రెడ్డి ని కలుస్తామన్నారు. ఈ విలేఖర్ల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే తన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నాగోల్ల లక్ష్మీనారాయణ, న్యాలశీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## "ఫిట్ & యాక్టివ్ తెలంగాణ" నినాదంతో యువజన వారోత్సవాలు ప్రారంభం

**- 5కే మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత, క్రీడాకారులు**



కొత్తగూడెం బ్యూరో మే 19(విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక"లో భాగంగా జిల్లా, మండల స్థాయిలలో నిర్వహిస్తున్న "యువజన వారోత్సవాలు" సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా "ఫిట్ & యాక్టివ్ తెలంగాణ" నినాదంతో యోగ, ఏరోబిక్స్, 5కే మారథాన్ రన్ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రకాశం స్టేడియం నుంచి రైల్వే స్టేషన్, కొత్తగూడెం వరకు జరిగిన మారథాన్‌లో సుమారు వెయ్యి మంది యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ క్రీడలు, శారీరక శ్రమ ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ఆరోగ్య తెలంగాణ సాధనలో ఇటు వంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, భవిష్యత్తులో కొత్తగూడెం మునిసిపల్ పరిధిలో పెద్ద ఎత్తున క్రీడా మైదానాల ఏర్పాటు చేపడతామని యువతకు హామీ ఇచ్చారు. జిల్లా యువజన మరియు క్రీడల అధికారి మాట్లాడుతూ చిన్నారుల నుంచి అన్ని వయసుల వారు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం, ఫిట్‌నెస్ సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు ఎం. హరిత, జల్లి శ్రీలక్ష్మి, ఆకునూరి సుప్రియ, దంతబోయిన నరేశ్, గుర్రం వెంకటేశ్వరరావు, క్రీడా సంఘాల ప్రతినిధులు వై. శ్రీనివాసరావు, మహీధర్, కాశీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి కృషి.

**- రైతులకు అండగా ములుగు జిల్లా పోలీసులు.**

**- ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్.**



ములుగు మే 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్ స్థానిక అధికారులైన ములుగు డిఎస్పి రవీందర్, సీఐ ఎస్ఐ లతో కలిసి అబ్బాపూర్‌లోని శ్రీ మాతా ఆగ్రో టెక్ పారా బాయిల్డ్ రైస్ మిల్లును ఎస్పి పరిశీలించి మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాంటా తూకం యంత్రాన్ని, వడ్ల నాణ్యత తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లు పారదర్శకంగా కొనుగోలు చేయాలని, తూకం విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి ఎస్పి ఆదేశించారు. తూకంలో తేడాలు గమనిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పన్నారు.

## పీఎం రాహత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..**



నిజామాబాద్ మే18:(విజన్ ఆంధ్ర )కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన " పీఎం రాహత్ " పథకాన్ని ఇందూరు వాసులు సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఒక ప్రకటన లో తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించడమే పథకం ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేరిన వారికి ఏడు రోజుల పాటు వర్తిస్తుందన్నారు. నిర్నిత రోజుల్లో రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్సను అందజేస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ అమలవుతున్న ఆసుపత్రుల్లో త్వరలోనే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కావున జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# జిల్లాలో యాసంగి సీజన్‌లో 5,66,800 క్వింటాళ్లు మొక్కజొన్నలు కొనుగోలు

**- మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్ర మోహన్**

గద్వాల మే 18 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో యాసంగి 2025-26 సీజన్‌లో ఏర్పాటు చేసిన 8 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 5,66,800 క్వింటాళ్లు (11,33,000 బస్తాలు) మొక్కజొన్నను కొనుగోలు చేయడం జరిగిందని మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్ర మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో రైతుల నుండి సేకరించిన మొక్కజొన్నను యుద్ధ ప్రాతిపదికన సమీప గోడౌన్లకు తరలించే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇంకా మిగిలిన ప్రాంతాల్లో ఉన్న స్టాక్‌ను కూడా త్వరితగతిన గోడౌన్లకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామనీ స్పష్టం చేశారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# బస్ డ్రైవర్ వడిదెబ్బకు అస్వస్థత



భూపాలపల్లి జిల్లా 18 మే (విజన్ ఆంధ్ర) : భూపాలపల్లి బస్ డిపో లో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న రావుల సంతోష్ కు వడదెబ్బ తో తీవ్ర అస్వస్థత. భూపాలపల్లి మంచిర్యాల రూట్ ట్రిప్పు పూర్తి చేసుకొని వచ్చాక విధులలోనే అస్వస్థతకు గురయ్యాడు.ఈ క్రమంలో వెంటనే స్పందించిన తోటి ఆర్టీసీ ఉద్యోగులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. జిల్లాలో గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు బయటికి వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. ఓవైపు ఎండ వేడి మరోవైపు బస్సు ఇంజన్ ద్వారా వచ్చే వేడితో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# మే 20న బంద్ కు పార్మసిస్టుల సంక్షేమ సంఘం ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదు..



సూర్యాపేట మే 18:(విజన్ ఆంధ్ర) : మే 20న అన్ని ఫార్మసీ దుకాణాలు తెరిచే ఉంటాయని తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోదిల రోజశ్రీ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కూర్మ శంకర్ ఆదేశానుసారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ఫార్మసిస్టుల ఆధ్వర్యంలో నడుస్తున్న 20 మెడికల్ షాపులు ప్రజా సేవకు ప్రధానంగా భావిస్తూ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు ఎప్పటికప్పుడు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మే 20న బంద్‌కు పిలుపునిచ్చిన కెమిస్టులు మరియు డ్రగ్గిస్టుల సంఘానికి తమ ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు అర్హత కలిగిన ఫార్మసిస్టులు లేకుండా నడుస్తున్న కొన్ని దుకాణాల కారణంగా ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సూర్యాపేటలో సుమారు 200కు పైగా మెడికల్ షాపులు ఉన్నప్పటికీ, కేవలం ఫార్మసీ విద్య పూర్తి చేసి స్వయంగా దుకాణాలు నిర్వహిస్తున్న ఫార్మసిస్టులే ప్రజల ఆరోగ్య భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గద్దల సైదులు, టౌన్ అధ్యక్షులు సుంకరబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన : ఎస్పి నరసింహ



సూర్యాపేట మే 18:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తులనైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం

**-జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**



నారాయణపేట ప్రతినిధి మే 18 (విజన్ ఆంధ్ర) : భవిష్యత్తులోసంభవించే ఎలాంటి విపత్తుల నైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ డి ఎం ఏ) ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం (డి ఆర్ ఎఫ్) సూచనల మేరకు నారాయణపేట జిల్లా కృష్ణా మండలం నదీ పరివాహక ప్రాంతమైన వాసునగర్ లో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా వాసు నగర్ లో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును దగ్గరుండి పరివేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే కృష్ణానది కి 6 నుంచి 7 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే వాసు నగర్ లో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మోక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డీఎఫ్ఓ సురేష్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ ఈ వెంకట రమణ, ఆర్టీవో మేఘా గాంధీ, పీ ఆర్ ఈ ఈ అశోక్, జిల్లా మత్స్య అధికారి రెహమాన్, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, డీపీ ఆర్ వో రషీద్, కృష్ణా తహసిల్దార్ శ్రీనివాస్, వాసు నగర్ సర్పంచ్ సాశీతమ్మ, ఇతర జిల్లా శాఖల అధికారులు,రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూముల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి

**- డబుల్ బెడ్ రూమ్ లకు నిధులు కేటాయించాలి**

**- సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు డిమాండ్.**



కొత్తగూడెం బ్యూరో మే 19(విజన్ ఆంధ్ర) : పాత కొత్తగూడెంలో గత ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించి నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని మాజీ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం డివిజన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్రూంల నిర్మాణాన్ని చేపట్టి నిర్మాణాలు పూర్తి కాకుండానే లబ్ధిదారులను నిర్ణయించడం జరిగిందని ఉన్నారు. ఇది ఆనాడు ఓట్ల కోసం ప్రభుత్వం చేసిన మోసంగా పరిగణించక తప్పదని ఆయన విమర్శించారు. 2016లో పాత కొత్తగూడెంలో ఎనిమిది వందల 26 డబుల్ బెడ్ రూమ్ లను నిర్మాణాన్ని ప్రారంభించారని, అందులో కనీసం 200 గృహాలు కూడా పూర్తి కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసం ఆరోజు హడావుడిగా నిర్మాణాలు పూర్తి కాకుండానే డ్రా తీయడం జరిగిందని అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి మంజూరు పత్రాలు ఇవ్వకుండానే మోసం చేశారని ఆయన విమర్శించారు. అప్పటి నుండి ఇప్పటికి నిర్మాణాలు పూర్తికాక ఇటు 75 గజాల స్థలం కు, ఇందిరమ్మ గృహాలకు లబ్ధిదారులను అనర్హులుగా తెల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ల నిర్మాణం పూర్తికాక, ఇటు ఇందిరమ్మ గృహాలు మంజూరు కాక, సంకట స్థితిలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు తక్షణమే ప్రభుత్వం స్పందించి వీటికి నిధులను కేటాయించాలని, అప్పుడు డ్రాలో అర్హులైన లబ్ధిదారులకు డబల్ బెడ్రూంలు కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అందులో అనర్హులు ఉంటే వాటి వరకే ఆ జాబితా నుండి తొలగించాలే తప్ప మొత్తానికి మరల డ్రా తీస్తామంటే అనేకమంది పేదవారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉందని తక్షణమే వాటికి నిధులు కేటాయించి, అప్పుడు డ్రా తీసిన అర్హులైన వారికే డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఓం నారాయణ, గడిదాసు కుమార్, బత్తుల పద్మ, గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**-అదనపు కలెక్టర్, ఎం డెవిడ్ ...**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 :విజన్ ఆంధ్ర. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం డెవిడ్ అన్నారు . సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ,అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమములో వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు గత ప్రజావాణిలో అందిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దరఖాస్తు దారుల నుండి అర్జీలు స్వీకరించారు ఆసిఫాబాద్ మండలంలోని రాహపల్లి గ్రామానికి చెందిన పిడుగు మొండయ్య తనకు సెంట్రింగ్ మేస్త్రి పనుల పరికరాల కొనుగోళ్ళ కొరకు పి ఎం జి పి రుణము ఇప్పించుట గురించి. రెబ్బెన మండలంలో ని గోలేటి కి చెందిన గుగులోత్ స్వప్న గోలేటి శివారులో ఉన్న సాగు భూమికి నీటి సౌకర్యం కల్పించడం కొరకు మోటారు పంపు మంజూరి దరఖాస్తు. కౌటాల మండల కేంద్రానికి చెందిన ఎలుములె జ్ఞానేశ్వర్ మొగడ్ ధగడ్ క్రాస్ రోడ్డ్ వద్ద డ్రైనేజి నిర్మించుట గురించి దరఖాస్తు లింగాపూర్ మండలంలోని మొతిపటార్ గ్రామానికి చెందిన జాదవ్ లలిత ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేదుకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించుట గురించి దరఖాస్తు .రెబ్బెన మండలం నవేగం గ్రామనికి చెందిన కమటి శంకర్ తనకు దివ్యంగా పించన్ ఇప్పించుట గురించి దరఖాస్తు, రెబ్బెన మండలం గోలేటి చెందిన కట్ల రజిత తనకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి గురించి దరఖాస్తు . జిల్లా కేంద్రానికి చెందిన ఎం డి జమిల్ హుస్సేన్ తనకు ఫ్రీడం ఫైటర్ సర్టిఫికేట్ మంజూరి గురించి దరఖాస్తు జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన కొడప మిరభాయి తనకు రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు .

# ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా వుండాలి


**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ...**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే -18.విజన్ ఆంధ్ర. రాష్ట్రంలో వరదలు అగ్ని ప్రమాదాలు సంబవించేటప్పుడు ప్రాణా నష్టము ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రంగా సిద్ధంగా వుండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి 18 జిల్లాలో వరదలు అగ్ని ప్రమాదాలపై నిర్వహించిన మాక్ ఎక్స్ ర్ సైజ్ నమూనా ప్రదర్శన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటి అధికారులు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం వుందన్నారు భారీ వర్షాల వల్ల నదులు వాగులు ఉధృతంగా ప్రవహించే గ్రామాలను లోతట్టు ప్రాంతాలను ముంచే త్తుత్తాయని ముందస్తుగా ప్రజలను సురక్షితంగా రక్షించేందుకు అధికార యంత్రంగం ఎన్ డి ఆర్ ఎఫ్ ,ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది సిద్దంగా వుండాలన్నారు పరిశ్రమలలు వాణిజ్య సముదాయలలో భారీ అగ్ని ప్రమాదాలు ఇటీవల సంబవించి భారీగా ప్రాణ నష్టాలు ఆస్తి నష్టం సంబవించయన్నారు అగ్నిమాపక శాఖ అధికారులు ప్రమాదాలు సంబంధించినప్పుడు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని రక్షణ చర్యలు చేప్పట్టి అస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా నియంత్రించలన్నారు అడవులలో నిప్పురవ్వలు పడి అడవి లోని విలువైన సంపద కాలి బూడిద అవుతున్నాయని అటవి శాఖ సిబ్బంది అప్రమతంగా ఉంది అడవులను రక్షించుకొవలన్నారు సిబ్బందిని శిక్షణ ఇవ్వాలన్నారు ప్రమాదాలు నివారణకు అధికారులు అప్రమత్తంగా వుండాలన్నారు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు సమీకృత కలెక్టరేట్ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ కె హరిత హాజరయ్యారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్ మండలంలోని వేంపల్లి అటవీ ప్రాంతంలో అటవీశాఖ, రెవిన్యూ ,అగ్నిమాపక శాఖ ,రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ, పంచాయతీరాజ్, పోలీస్ వెటర్నరీ విద్య వైద్య ఆరోగ్యశాఖ, అధికారులు పాల్గొని అటవీ అగ్ని ప్రమాదాల నియంత్రణపై మాక్ ఎక్స్ ర్ సైజ్ నమున ప్రదర్శను నిర్వహించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు జిల్లాలో విపత్తులు అగ్ని ప్రమాదాలు సంబవిస్తే ఎదురుకోవడానికి అధికార యంత్రాగం సిద్దంగా ఉందని కలెక్టర్ అన్నారు . ఈ కార్యక్రమములో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

**-అడిషనల్ కలెక్టర్ సంగీత**



సంగారెడ్డి బ్యూరో,మే :18(విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలోఅదిషనల్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 12, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 19, జహీరాబాద్ డివిజన్‌కు 08 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళల ఆరోగ్య రక్షణ కోసమే హెల్త్ మిషన్-100

**-టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**



సంగారెడ్డి బ్యూరో, మే, 18(విజన్ ఆంధ్ర ) : తెలంగాణలోని డ్వాక్రా మహిళల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం హెల్త్ మిషన్-100 (100 రోజుల ఆరోగ్య మిషన్) అనే బృహత్తర కార్యక్రమం ద్వారా ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తుందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా గ్రామణాభివృద్ధి శాఖ, కంది మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లో కంది గ్రామ పిహెచ్సి లో ఏర్పాటు చేసిన వైద్య పరీక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో సాధారణంగా వచ్చే బిపి, సుగర్, థైరాయిడ్, రక్త హీనత వంటి 30 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ప్రతీ మహిళ కు క్యుఆర్ కోడ్ తో కూడిన "డిజిటల్ హెల్త్ కార్డ్" రూపొందించి ప్రభుత్వ పోర్టల్ లో భద్రపరుస్తారని వివరించారు. దీనివల్ల భవిష్యత్తు లో ఏ ఆసుపత్రికి వెళ్ళిన వారి పూర్తి ఆరోగ్య చరిత్ర అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలకు సద్వినియోగం చేసుకోవాల ని కోరారు. ఈ కార్యక్రమం లో కంది గ్రామ సర్పంచ్ శ్రీరామ్, ఉప సర్పంచ్ ఖాన్, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

# దివ్యాంగులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**-టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**



సంగారెడ్డి బ్యూరో, మే, 18(విజన్ ఆంధ్ర ) : ఆత్మస్థైర్యం తో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన ఎంతో మంది దివ్యాంగులు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని టీ జి ఐ ఐ సి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని సంజీవ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ సమగ్ర శిక్ష , అల్మికో ఆధ్వర్యంలో సోమవారం నాడు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వినికిడి పరికరాలను , వీల్ చైర్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ప్రోత్సాహం అందించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు సంగీతా మహేష్, యశోద , విద్యాశాఖ అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచి భగవంతుడి సేవలో తరించాలి

**- భాగవత సప్తహ ప్రారంభంలో స్వామి విద్యా సింధు మాధవ తీర్థులు**



నారాయణపేట మే 18 (విజన్ ఆంధ్ర) : ప్రతి ఒక్కరు దైనందిన కార్యక్రమాలతో పాటు సన్మార్గంలో నడిచి భగవంతుడి సేవలో తరించాలని బెంగళూరుకు చెందిన స్వామి విద్యా సింధు మాధవ తీర్థులు అన్నారు. అధిక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం నారాయణపేట లక్ష్మీ నరసింహ సహిత రాఘవేంద్ర స్వామి ఆలయంలో భాగవత సప్త కార్యక్రమం ప్రారంభం నిర్దేశించి స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఏడు రోజులపాటు ఉదయం సాయంత్రం స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తారు. మధ్యాహ్నం శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహాలకు సంస్థాన పూజ స్వామీజీ నిర్వహించారు. కార్యక్రమంలో యజ్ఞ నారాయణ పురోహిత్, జోషి రఘు ప్రేమాచారి రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు నరసింహ చారి అనిల్ జయ సాయి శ్రీవత్స నరసింహ సీతారాం రావు ధరణి ధర్ దీక్షిత్ శేషు శక్తిపీఠం స్వామి శాంతానందా యజుర్వేద స్మార్త పండితులు విద్వాన్ విభావసు పురోహిత్, విద్వాన్ ధీరజ్ ప్రహ్లాద తదితరులు ఉన్నారు.

# యువత టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**- యువ టూరిజం క్లబ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్**



కొత్తగూడెం బ్యూరో, మే 19(విజన్ ఆంధ్ర) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23 వరకు నిర్వహించనున్న టూరిజం వారోత్సవాల సందర్భంగా "యువ టూరిజం క్లబ్" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత టూరిజం రంగంపై అవగాహన పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు యువతలో పర్యాటక ప్రదేశాల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. టూరిజం వారోత్సవాల సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మే 19న పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద టూరిజం అవేర్‌నెస్ డ్రైవ్, మే 20న లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ రాక్ కేవ్స్ వద్ద హెరిటేజ్ వాక్, మే 21న జిల్లాలోని యూట్యూబర్లతో సమావేశం, మే 22న బౌద్ధ రాక్ కేవ్స్ ప్రాంతంలో స్వచ్ఛత డ్రైవ్, మే 23న పాల్వంచలోని ఐడాక్‌లో బ్రాండ్ కిట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు . టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ" మరియు "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ ఆర్కియాలజీ" కోర్సులను యువత వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కోర్సుల ద్వారా పర్యాటక, పురావస్తు, మ్యూజియం రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజును సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9849905722, 9849905723

# దివ్యాంగ విద్యార్థులకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి సహాయక కిట్ల పంపిణీ,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): మే 18 : దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు, దివ్యాంగ విద్యార్థులకు 108 సహాయక ఉపకరణాల పంపిణీ, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, దివ్యాంగుల విద్యార్థుల సంక్షేమం, వారి విద్యా హక్కుల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధి, స్వయం సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 81 మంది దివ్యాంగ విద్యార్థులకు 14 రకాల 108 ఉపకరణాలు, సహాయక కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీల్‌చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, ట్రైసైకిళ్లు, వాకర్లు, విద్యా సామగ్రి తదితర ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గమనిస్తోందని, వారికి అన్ని విధాలుగా అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులు కూడా సమాజంలో సమాన హక్కులతో జీవించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్య, ఉపాధి, వైద్య సేవలు, పునరావాసం వంటి రంగాల్లో ప్రత్యేక పథకాల ద్వారా దివ్యాంగులకు ప్రోత్సాహం అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగ పిల్లలకు కూడా నాణ్యమైన విద్య, అవసరమైన సహాయక ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం "నా విద్య" కార్యక్రమం ద్వారా ప్రత్యేక సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫిజియోథెరపీ సేవలు, ప్రత్యేక శిక్షణతో పాటు అవసరమైన విద్యా సహాయక ఉపకరణాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రతి దివ్యాంగ విద్యార్థి సాధారణ విద్యతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ.కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్ కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, విలీన విద్య కోఆర్డినేటర్ వెంకటయ్య, వెంకటేశ్వర శెట్టి, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహనకు 2కే రన్

**- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాలు**
**- అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్**
**- యువత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**
**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**






రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 18 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు, యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించేందుకు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాకేంద్రంలో 2కే రన్ నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు సోమవారం 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కింద జూన్ 12 వరకు జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై కూడా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 19న జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కెరీర్ & నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం, 21న మినీ స్టేడియంలో క్రీడా పోటీలు, 22న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఈ నెల 23న సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని కె కన్వెన్షన్ హాల్‌లో "ఉద్యోగ సాధన" పేరుతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప రెడ్డి, డీవైఎస్ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రమాధాలపై విజయవంతంగా ముగిసిన మాక్ ఎక్సర్ సైజ్

**- నిశితంగా పర్యవేక్షణ చేసిన అదనపు కలెక్టర్ పాండు**
**-అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి**



సంగారెడ్డి బ్యూరో,మే,18(విజన్ ఆంధ్ర )పరిశ్రమల లో ప్రమాదాలు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసు కునేందుకు వీలుగా సోమవారం సంగారెడ్డి జిల్లాలోని బయోకాన్ లిమిటెడ్ పాశమైలారంలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా పూర్తయింది. అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా తెలిసింది. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను తలపించేలా ఉన్నాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, పారిశ్రామిక ప్రమాదాల సమయాలలో ఏవిధంగా వ్యవహరించా లన్నది ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. అంబులెన్స్ లు,అగ్నిమాపక శకటాలు, వైద్య బృందాలు, పోలీస్, రెవెన్యూ, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటి చెబుతూ ప్రజల్లో, పరిశ్రమ కార్మికుల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ ఆర్ ఎఫ్ బృందం మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, , హెల్త్, విద్యుత్, పరిశ్రమలు తదితర అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్ సైజ్ ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అప్రమత్తతతో నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. అన్ని శాఖల అధికారులు, కంపెనీ యాజమాన్యం, ఎన్ డీ ఆర్ ఎఫ్, ఉద్యోగుల సమన్వ యంతో మాక్ డ్రిల్ విజయవంతమైందన్నారు అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, కంపెనీలో ఏర్పాటు చేసిన ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఏ కంపెనీలోనైనా ప్రమాదం సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు పోలీసు శాఖకు సమాచారం అందజేయాలని సూచించారు. అలాగే, కంపెనీ యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలకు వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తొలి దశలో వేగంగా స్పందించడం వల్ల ప్రమాద తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది , ఆయా బృందాలు సమన్వయంతో పనిచేయడం వల్ల మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించగలిగామని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రాజేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు, పోలీస్ వైద్య ఆరోగ్య, పరిశ్రమలు రెవిన్యూ , విద్యుత్ శాఖ ల అధికారులు, బయోకాన్ కంపెనీప్రతినిధులు,కార్మికులు , తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

**- కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ**



కొత్తగూడెం బ్యూరో, మే 19 (విజన్ ఆంధ్ర) : రాబోయే బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ సూచించారు. సోమవారం కొత్తగూడెం ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ అండ్ ఎం ఫంక్షన్ హాల్‌లో పట్టణంలోని మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలంతా మత సామరస్యంతో పండుగలను నిర్వహించుకునేలా ఆయా మతాల పెద్దలు సమన్వయం చేయాలని కోరారు. పండుగ ఏ మతానిది అయినా సామరస్య భావన సమాజంలో మంచి సంబంధాలను పెంపొందిస్తుందని తెలిపారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మత పెద్దలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం రెండవ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఒకటవ టౌన్ సీఐ కరుణాకర్, మూడవ టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి , కొత్తగూడెం పట్టణంలోని వివిధ మతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పివికే-5 ఇంక్లైన్ గనిలో మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశం

**ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమిష్టి కృషి చేయాలి**







కొత్తగూడెం బ్యూరో, మే 19(విజన్ ఆంధ్ర) : కొత్తగూడెం ఏరియాలోని పివికే–5 ఇంక్లైన్ గనిలో సోమవారం మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశం నిర్వహించారు. ఉదయం మొదటి షిఫ్ట్‌లో, మధ్యాహ్నం రెండో షిఫ్ట్‌లో జరిగిన ఈ సమావేశంలో గని ఉత్పత్తి, భద్రత, ఉత్పాదకత, ఉద్యోగుల సంక్షేమంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మల్టీ డిపార్ట్మెంట్ టీం సభ్యులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఐఏఎస్ ఆదేశాల మేరకు సంస్థలోని ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసి వినియోగదారులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలను రక్షణతో, సమైక్య భావనతో, సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. సింగరేణి సంస్థలోని 11 ఏరియాల్లో మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని పివికే–5 ఇంక్లైన్‌లో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. పివికే–5 ఇంక్లైన్‌లో గైర్హాజరు శాతం అధికంగా ఉండటం వల్ల నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనలో వెనుకంజలో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తిని పెంచేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గనిలో ఎటువంటి సీరియస్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉత్పత్తి కొనసాగిస్తున్నందుకు గని ఉద్యోగులను మల్టీ డిపార్ట్మెంట్ టీం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పివికే–5 ఇంక్లైన్ ఏజెంట్ రామ్ భరోస్ మహతో మాట్లాడుతూ సంస్థ పరిస్థితులు, ఉత్పత్తి వ్యయం, ఉత్పాదకతపై అవగాహన కల్పించే ఇటువంటి సమావేశాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేస్తూ నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం డిజిఎం (ఐఈడి) ఎన్. యోహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల పనితీరు, ఉత్పత్తి వ్యయం, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం (ఐఈడి) ఎన్. యోహాన్, పివికే–5 ఇంక్లైన్ ఏజెంట్ రామ్ భరోస్ మహతో, డిజిఎం (ఈ అండ్ ఎం) ఐ.వి.ఎస్.బి లక్ష్మణమూర్తి, అడిషనల్ మేనేజర్ (క్వాలిటీ) కే. సత్యనారాయణ రాజు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, పద్మావతి గని మేనేజర్ ఎం.వి.ఎన్. శ్యాం ప్రసాద్, ఎస్.ఈ (ఐఈడి) కే.ఆర్. నాగభూషణం, గని రక్షణ అధికారి వై.వి.ఎస్.కే కిషోర్ బాబు, సంక్షేమ అధికారి షేక్ షకీల్, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ చిలక రాజయ్య, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ భుక్యా రమేష్ తదితర అధికారులు, ఉద్యోగులు, సూపర్వైజర్లు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ప్రజాపాలన సభకు విస్తృత ఏర్పాట్లు

## సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 18 (విజన్ ఆంధ్ర): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న సభ నిర్వహణపై సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సభా ప్రాంగణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆరు గ్యారంటీలు, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రాలు రూపొందించి సభలో పంపిణీ చేయాలని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పథకాల లబ్ధిదారులను సభకు ఆహ్వానించాలని ఆదేశించారు. సభలో తెలంగాణ రాష్ట్ర గీతం, స్వాగతోపన్యాసం, సీఎం సందేశం ప్రసారం చేయాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్నరకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి తదితర పథకాల అమలు వివరాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కేఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి తదితర అధికారులు పాల్గొన్నారు.

# గోవా అంతర్జాతీయ సదస్సులో "హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు 2026" అందుకున్న తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్



విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ : దుబ్బాక మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు, గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. గోవాలో మే 16వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫరెన్స్ 2026 కార్యక్రమంలో ఆయనకు "హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు 2026" ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ అంతర్జాతీయ సదస్సు విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. సమాజంలో అణగారిన వర్గాల పక్షాన నిలబడి సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి సత్కరించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు అడ్వకేట్ శ్రీ రాగసందేశ్, నేషనల్ ప్రెసిడెంట్ శ్రీ కొంగర అనిల్ కుమార్ చేతుల మీదుగా గుర్రాల శ్రీనివాస్ అవార్డును స్వీకరించారు. సభలో ఈ ఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచి మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న నాయకులకు ఇలాంటి అంతర్జాతీయ స్థాయి గుర్తింపులు రావడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గుర్రాల శ్రీనివాస్ గత అనేక సంవత్సరాలుగా దళితులు, బడుగు బలహీన వర్గాలు, అణగారిన సమాజాల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్నారు. సామాజిక అన్యాయం, వివక్ష, హక్కుల ఉల్లంఘనలపై ఆయన చేస్తున్న పోరాటం అనేక మంది బాధితులకు న్యాయం అందించే దిశగా కీలక పాత్ర పోషిస్తోందని సభలో పలువురు కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రాజ్యాంగ చైతన్యం, సామాజిక అవగాహన పెంపొందించడంలో ఆయన పాత్ర విశేషమని అభిప్రాయపడ్డారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా ఇప్పటికే "దళిత రత్న అవార్డు"తో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు (దీూా) కూడా ఆయన అందుకున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణం కోసం ఆయన చేస్తున్న కృషిని సదస్సులో పాల్గొన్న పలువురు ప్రముఖులుప్రత్యేకంగా ప్రశంసించారు.సదస్సులో జరిగిన చర్చల్లో మానవ హక్కుల పరిరక్షణ అనేది కేవలం బాధ్యత మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని వక్తలు పేర్కొన్నారు. బలహీన వర్గాల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడే నాయకులను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మరింత చైతన్యం పెరుగుతుందనిఅభిప్రాయపడ్డారు. అవార్డు స్వీకరించిన అనంతరం గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఈ గౌరవం నా ఒక్కరికి సంబంధించినది కాదు. సమాజంలో న్యాయం కోసం, హక్కుల కోసం పోరాడుతున్న ప్రతి సామాన్యుడికి చెందిన గౌరవం ఇది. భవిష్యత్తులో కూడా రాజ్యాంగ పరిరక్షణ, మానవ హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం మరింత కట్టుబాటుతో పనిచేస్తాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు గుర్రాల శ్రీనివాస్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణిలో 98 ఆర్జీలు వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి - కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 18మే : సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకుసూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 98 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, ఎస్డిసి వరలక్ష్మి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిఆర్ఓ ఎస్. పద్మావతి



కొత్తగూడెం బ్యూరో మే 19(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా (డిఆర్ఓ) నియమితులైన ఎస్. పద్మావతి సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై స్వల్పంగా చర్చించారు.

## దివ్యాంగుల సమస్యలకు కలెక్టర్ తక్షణ పరిష్కారం

- ఇద్దరికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్ల పంపిణీ
- ట్రై సైకిళ్లు అందుకుని ఆనందం వ్యక్తం చేసిన దివ్యాంగులు



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 18 (విజన్ ఆంధ్ర): దివ్యాంగుల ఇబ్బందులను గుర్తించి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెంటనే స్పందించి వారికి సహాయం అందించారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల శ్రీనివాస్, ముస్తాబాద్ మండలం గూడెం కొమిరే పరశురాములు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి పనిమీద వచ్చారు. వారిని గమనించిన కలెక్టర్ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బయటకు వెళ్లేందుకు, రోజువారీ పనులు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వివరించగా, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంకు ఆదేశాలు జారీ చేసి ఇద్దరికీ బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేయించారు. అదేవిధంగా హెల్మెట్లు కూడా పంపిణీ చేశారు. తమ సమస్యను అర్థం చేసుకుని మానవతా దృక్పథంతో తక్షణ సహాయం అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి 18 ( విజన్ ఆంధ్ర ) : పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా ఈ నెల 18 నుండి 23 వరకు పర్యాటక వారోత్సవాలు,క్రీడా యువజన వారోత్సవాలు, పోస్టర్ లు,కరపత్రాలు ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి. .ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా ఈ నెల 18 నుండి 23 వరకు క్రీడా,యువజన వారోత్సవాలు,పర్యాటక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో టూరిజం వీక్ , యూత్ & స్పోర్ట్స్ వీక్ పోస్టర్ లు,బ్రోచర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. వికారాబాద్ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ "యువ టూరిజం క్లబ్" పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమం యువతలో పర్యాటక రంగంపై అవగాహన పెంపొందించడం, వారిని స్థానిక పర్యాటక ప్రదేశాల అభివృద్ధి మరియు పరిరక్షణలో భాగస్వాములను చేయడం లక్ష్యంగా నిర్వహించబడిందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ , వెంకటాచారి , జడ్ పి సి ఇ ఓ సుదీర్, రేంజ్ అధికారి శ్యాం ,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ పకడ్బందీగా జరిగేలా బి ఎల్ ఏ లు కృషి చేయాలి

- సర్ జిల్లా ఇంఛార్జి రఘువీర్ యాదవ్

నారాయణపేట మే 18(విజన్ ఆంధ్ర ) : ఎన్నికల కమిషన్ ఓట్ల ప్రక్షాళనకు నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ నారాయణపేట జిల్లాలో పకడ్బందీగా జరిగేలా బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది, సర్ జిల్లా ఇంఛార్జి రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి బి ఎల్ ఏ లు దగ్గరుండి అధికారులకు సహకరించాలని అన్నారు.ముఖ్యంగా దొంగ ఓట్లను తొలగించాలని,రోహిగ్యాల ఒక్క ఓటు ఉండకుండా చూడాలని,వలస వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారి ఓట్లను తొలగించాలని,చనిపోయిన వారి ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఓట్లను తొలగించాలని సూచించారు. అధికార కాంగ్రెస్,మైనార్టీ ఓట్లకు కక్కుర్తి పడే బి ఆర్ ఎస్ పార్టీలు పశ్చిమ బెంగాల్ నుంచి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో రోహిగ్యాలు జొరబడుతున్నారని అట్టి వారి ఓట్ల నమోదుకు ఆపార్టీలు పని చేస్తాయని హెచ్చరించారు.దీని పట్ల ప్రతి ఏజెంట్ అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లను నమోదు చేయకుండా అడ్డుకోవాలని కోరారు.

## వడ్డెర కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- 67 ద్విచక్ర వాహనాలు, 16 ఆటోలు, 2 ట్రాక్టర్లు స్వాధీనం.
- 98 దేశిదారూ, 12 లిక్కర్ బాటిల్ స్వాధీనం, ముగ్గురిపై కేసులు నమోదు.
- ఆసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవు.
- ప్రజల సంరక్షణ, భద్రతకై కమ్యూనిటీ కాంటాక్ట్ ల నిర్వహణలి
- 100మంది సిబ్బందితో ఉదయం 5 గంటల నుండి 9 వరకు తనిఖీలు.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 18, (విజన్ ఆంధ్ర) ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీ లో ఉదయం ఐదు గంటల నుండి 8 గంటల వరకు 100 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువ పత్రాలు లేనటువంటి 67 ద్విచక్ర వాహనాలు, 16 ఆటో లను, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా తనిఖీలలో 98 దేశీ దారు, 12 లిక్కర్, బాటిల్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ముగ్గురుపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ.... గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, దొంగతనాలు, దోపిడీలు చేయకుండా సత్ప్రవర్తనతో మెదలాలను తెలిపారు. ఇదివరకే కేసులలో నమోదైన వారిపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని, ఇంతకీ మారని పక్షంలో చివరగా పీడీ యాక్ట్ సైతం నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. దొంగతనాలు చేసే వారి, నేరాలు చేసే వారి సమాచారం పోలీసులకు అందజేయాలని కాలనీకి మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటినుండి చదువుపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని, దొంగతనాలు అసాంఘిక కార్యకలాపాలు చేయకుండా పర్యవేక్షించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని, ముఖ్యంగా ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సక్రమంగా వాహనాలను నడుపుతూ ఉండాలని తెలిపారు. వాహనాలను విత్‌ఔట్ నంబర్ ప్లేట్ నడపడం, లైసెన్సు లేకుండా నడపడం చట్టరీత్య నేరంగా పరిగణించబడుతుందని అలాంటి చేయకుండా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, ప్రణయ్ కుమార్, కె ఫణిదర్, కె స్వామి, బిడి ప్రేమ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు డి వెంకటి,టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్ఐలు రాధిక, విష్ణువర్ధన్, ఎస్సైలు దేవేందర్, విష్ణు ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మజిలీస్ పార్టీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ధర్మాచార్య సంపర్క ప్రముక్ పగుడాకుల బాలస్వామి
- గోవులను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం
- పోలీసులను భయబ్రాం తులకు గురిచేస్తున్న ఎంఐఎం నేతలు పట్టించుకోని పాలకులు



నారాయణపేట, మే 18 (విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా భాగ్యనగర్ లో గో హత్యలు విపరీతంగా పెరుగుతున్నాయని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కారణమని విశ్వహిం దూ పరిషత్ రాష్ట్ర ధర్మాచా ర్య సంపర్క ప్రముక్ పగడా కుల బాలస్వామి ఆరోపించా రు. ఓటు బ్యాంకు రాజకీయా లకు కక్కుర్తి పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎంఐఎం ఆదేశాలకు తలొగ్గిందని విమ ర్శించారు. ఎంఐఎం ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, కార్పొరేట ర్లు నడిరోడ్డుపై వచ్చి పోలీ సులపైనే దౌర్జన్యం చేస్తున్న ప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత హేయమని ఆయన విమ ర్శించారు. ఈ మేరకు సోమ వారం బాలస్వామి ఓ ప్రకట న విడుదల చేశారు. స్వయం గా రైతు బిడ్డ అయిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, డిజిపి సి వి ఆనంద్ గోరక్షణలో ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యాధు నిక గోషాలలు నిర్మిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మరి గోవులను విపరీతంగా కోత కు తరలిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీ శారు. ముస్లిం అంటే కాంగ్రెస్ కాంగ్రెస్ అంటే ముస్లిం అనే మాటను నిలబెట్టుకోవడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతుడు అవుతున్నాడని ఎద్దేవా చేశా రు. ముస్లింల మెప్పుకోసం హిందువుల గొంతు కోస్తా రా..? అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలు తాకట్టుపెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. గోరక్ష చట్టాలు అమలు చేయడం లో పోలిస్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని బాలస్వామి ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీ సులకే సవాల్ సవాల్ చేస్తూ భయభ్రాంతులను సృష్టిస్తు న్న ఎంఐఎం నేతలను కట్టడి చేయడంలో చేతులు ముడు చుకుంటున్నారని విమ ర్శించారు. బక్రీద్ దగ్గర పడు తున్న కొద్దీ వేలాది గోవులు భాగ్యనగర్ పాతబస్తీకి చేరు కున్నాయని, వాటిని కాపాడి గోశాలలకు తరలించాలని పోలీసులను డిమాండ్ చేశా రు. నడిరోడ్డుపై పోలీసులను ఎంఐఎం నేతలు భయపెడు తుంటే కూడా స్పందించక పోవడం దారుణం అన్నారు. పైగా గోరక్ష చట్టాలను కఠినం గా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న హిందూ సంస్థల నాయకులపై కేసులు పెట్టడం అత్యంత దారుణం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సంస్థల నాయకులను భయపెట్టి గోవుల హంతకులకు మద్దతి స్తున్న రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవడం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు పేరుకు మాత్ర మే ఉన్నాయని, ఎక్కడ కూడా ఆవులను పట్టుకోవ డం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం స్పందిం చి అక్కడక్కడ డంపు చేసిన గోవులను వెంబడే విడుదల చేసి గోషాలకు తరలించాలని బాలస్వామి డిమాండ్ చేశారు.

## ఎట్టకేలకు దొంగ అరెస్ట్

- 10 దొంగతనాలు చేసిన నిందితుడు.
- భారీ మొత్తంలో నగదు బంగారు వెండి స్వాధీనం.



నారాయణపేట, 18 ( విజన్ ఆంధ్ర )మక్తల్ ,మరికల్ పోలీస్ స్టేష న్ల పరిధిలో వరుస దొంగత నాలకు పాల్పడుతున్న నేరస్తుడిని ఎట్టకేలకు మక్తల్ పోలీసులు అరెస్ట్ చేసి, భారీ మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ నారాయణపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో మక్త ల్ ఎస్ఐ వై. భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి అనుమానాస్పదంగా బైక్‌ను వదిలేసి పారిపోవడానికి ప్రయత్నించా డనీ తెలిపారు. ఎస్ఐ సిబ్బంది వెంటాడి అతడిని అదుపులోకి తీసు కుని విచారించగా అతని పేరు కర్రెం సూర్యనారాయణ ఏ తిమ్మప్ప ఏ తిప్పి ఏ సూర్య మక్తల్ అంబేద్కర్ కాలని వాసి అని తెలిపారు.మక్తల్ లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయ గా మంకీ క్యాప్, దొంగతనా లకు ఉపయోగించిన పని ముట్లు, చోరీ చేసిన ఆస్తికి సంబంధించిన వివరాలు లభించాయన్నారు. నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై డబ్బుల కోసం దొంగతనా లకు పాల్ప డుతున్నాడు. సోషల్ మీడి యా ప్రభావంతో గత ఏడాది కాలంగా మక్తల్ ప్రాంతంలోని షాపులు, వైన్ షాపులు, తాళం వేసిన ఇండ్లను పగటి సమయంలో రెక్కీ నిర్వహిం చేవాడనీ రాత్రి సమయంలో మంకీ క్యాప్, గ్లౌజులు ధరించి గుర్తుపట్టకుండా ముసుగు వేసుకొని జాగ్రత్తలు తీసుకు నేవాడనీ తెలిపారు. ఎలక్ట్రిక్ కట్టర్, భారీ సుత్తి, కట్టింగ్ ప్లేయర్స్, స్క్రూడ్రైవర్లు వంటి పనిముట్లతో షట్టర్ల తాళాలు, తలుపులు పగు లగొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసేవాడన్నారు. గత సంవత్సరం మే నెల నుంచి ఇప్పు టివరకు మొత్తం 10 దొంగత నాలకు పాల్పడ్డాడనీ తెలిపారు. వీటిలో 9 కేసులు మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధి లో కాగా, 1 కేసు మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైందన్నారు. నిదితుడు ఇప్పుట్ వరకు 9,28,000 నగదు, 2 తులాలు బంగా రం,3 కిలోలు వెండి, 7,200విలువైన 2 బాటిళ్లు,సిగరెట్లుమొత్తం 12,12,000 దొంగలించాడని స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుని ద్వారా 5,04,000 నగదు,13 గ్రాముల బంగారం,60 తులాలు వెండి,వి ఓ వి 50 మొబైల్ ఫోన్,రియల్ మీ 3 మొబైల్ ఫోన్ 35,000 విలువ చేసే సిగరెట్లు మొత్తం స్వాధీనం 9,19,500 స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

ప్రజలకు ఎస్పీ సూచనలు...

ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలకు బలమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా వ్యాపారులు తమ దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకో వాలని ఎస్పీ వినీత్ సూచిం చారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100 కు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసులను ఛేదించి, చోరీ సొత్తును స్వాధీనం చేసు కున్న పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలు , రివార్డులు అందజేయ నున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ మహేష్, మక్తల్ సీఐ కె. రాంలాల్, ఎస్ఐ లు వై. భాగ్యలక్ష్మి రెడ్డి, పురుషోత్తం, విజయ్ భాస్కర్, సిసిఎస్ టాస్క్ ఫోర్స్ బృందాలు, మక్తల్ క్రైమ్ ఏ ఎస్సై శంకరయ్య పి సి లు అశోక్,నరేష్ ,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి..



సూర్యాపేట మే 18:(విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 28 దరఖాస్తులు, డిఆర్డిఏ 14, డిడబ్ల్యుఓ 3, హౌసింగ్ 2, మిగిలిన 21 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 68 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, జడ్పీ సీఈఓ శిరీష, డిఎంహెచ్ఓ వెంకటరమణ డీఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఇఓ అశోక్జి,ల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

## జిల్లా ఎస్పీని కలిసిన మద్దూర్ నూతన ఎస్సై



నారాయణపేట ప్రతినిధి మే 18 (విజన్ ఆంధ్ర) : మద్దూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీనివాసులు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపి మద్దూర్ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి భద్రతపై భరోసా కల్పించాలని నూతన ఎస్సైకు సూచించారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు.

## ధాన్యం తరలింపుపై రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమీక్ష

- వాహనాలు, అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ సూచన
- సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎస్పీ మహేష్ బి గితే



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 18 (విజన్ ఆంధ్ర): జిల్లాలో ధాన్యం సేకరణ, తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉద్దేశంతో రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జరిగిన సమావేశానికి జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మండలాల వారీగా రైస్ మిల్లుల్లో ధాన్యం అన్‌లోడింగ్ పరిస్థితి, గోదాముల సామర్థ్యం, కొనుగోలు కేంద్రాలకు వాహనాల అందుబాటుపై అధికారులు ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు మరిన్ని వాహనాలు సమకూర్చాలని సూచించారు. ధాన్యం తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమ మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఖాళీ అయిన వాహనాలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ కుసుంతాయి ఆలంకు ఘన స్వాగతం పలికిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 18, ( విజన్ ఆంధ్ర) ఆదివాసి లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా డీసీసీ కార్యాలయానికి విచ్చేసిన ఆదివాసి కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ కుసుంతాయి ఆలంను ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధి, రాజకీయ చైతన్యం, నాయకత్వ వికాసం కోసం నిర్వహిస్తున్న లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఆదివాసి సమాజానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవ సేవయే మాధవ సేవ.. మదీనా మస్జిద్‌కు బాడీ బాక్స్ విరాళం

కొత్తగూడెం బ్యూరో, మే 19 (విజన్ ఆంధ్ర ) : 14 నెంబర్ ఏరియాలోని మదీనా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు ఉస్మాన్ పాషా ఆదేశానుసారం జరిగిన ఈ కార్యక్రమంలో పంజాబ్ గడ్డ ప్రాంతానికి చెందిన అమరజీవి మర్హూమ్ సనావుల్లా జ్ఞాపకార్థం ఆయన సతీమణి షమీమ్ ముస్లిం సోదరుల ఉపయోగార్థం బాడీ బాక్స్ (ఫ్రిడ్జ్) ను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ చైర్మన్ అహ్మద్ పాషా పాల్గొని బాడీ బాక్స్‌కు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్జిద్ కార్యదర్శి మహమ్మద్ అంకుష్ మాట్లాడుతూ బాడీ బాక్స్‌ను విరాళంగా అందించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ సేవా కార్యక్రమం కోసం కృషి చేసిన ఖాజా భాయ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాకుబ్ పాషా, గౌస్, అఫ్జల్ భాయ్, అలీం, సర్వర్, మొహమ్మద్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా 'తారా రమ్ పమ్-సెలబ్రిటీ సింగర్స్ అంతాక్షరి'

**-హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వకిటి శ్రీహరి**



హైదరాబాద్, మే 18 (విజన్ ఆంధ్ర) : ఐరో సంస్థ ఆధ్వర్యంలో నగరంలో వీఏఏ ద ఓజీస్ 'తారా రమ్ పమ్-సెలబ్రిటీ సింగర్స్ అంతాక్షరి' కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు ఐరో ఆర్గనైజర్ ప్రదీప్ కొండిపర్తి తెలిపారు. సోమవారం వైశ్య అచీవర్స్ అవార్డ్స్(విఎఎ) డైరెక్టర్ డా.నీలిమ వేముల తోకలసి ఆయన మాట్లాడుతూ ఒక ప్రత్యేకమైన సంగీత సమరం(బాటిల్ ఆఫ్ ది బర్డ్స్) తరహాలో ప్రదర్శితమైన ఈ కార్యక్రమంలో సెలబ్రిటీ గాయకులు, ప్రదర్శకులు పాల్గొన్న అంతాక్షరి పోటీ ప్రేక్షకులను ఎంతగానో అలరించిందని అన్నారు. ఎప్పటికీ గుర్తుండిపోయే పాత క్లాసిక్ పాటల నుండి నేటి చార్ట్‌బస్టర్ హిట్‌ల వరకు ప్రదర్శకులు తమ సంగీత ప్రతిభను, స్టేజ్ పర్ఫార్మెన్స్‌ను అద్భుతంగా చాటుకున్నారు. 'ద స్టేషన్' సంస్థ ఎంతో సృజనాత్మకంగా రూపొందించిన ఈ ఈవెంట్‌లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, యువజన, క్రీడల శాఖ మంత్రి వకిటి శ్రీహరి హాజరై విజేతకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

# కరీంనగర్ జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- **రూ.237 కోట్లు రైతుల ఖాతాల్లో జమ**
- **రికార్డు స్థాయిలో వారంలో 80 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు**
- **వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం**
- **రైతులకు ఇబ్బందులు రానివ్వం**
- **రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**




కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) మే 18 : కరీంనగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, వచ్చేవారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటి వరకు రైతులకు 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సీజన్లో 3.61 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికీ 3 లక్షల ఒక వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు. వచ్చిన ధాన్యం నుండి ఒక లక్ష 58 వేల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశామని, రైతులకు ఇందుకు సంబంధించి 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికతో ఉన్నామని అన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ సజావుగా సాగేలా చూడాలని తెలిపారు. రానున్న రెండు వారాలు మరింత కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీల సమస్య ప్రధానంగా కనిపిస్తోందని, లోకల్ హమాలీలను ప్రోత్సహిస్తూ ఈ సమస్యను అధిగమించాలని మంత్రి సూచించారు. ధాన్యం రవాణాకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారాలు ఇచ్చామని, లారీ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించి కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రాన్స్పోర్ట్ కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూసుకోవాలని, జిల్లా పంచాయతీ అధికారి హమాలీల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ధాన్యం లోడు పూర్తయిన ప్రతి వాహనం 24 గంటల్లోగా మిల్లులో అన్లోడ్ అయ్యేలా పక్కా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఎక్కువ పరిమాణంలో ధాన్యం కొనుగోలు చేస్తూ ఇంటర్మీడియట్ గోదాములను స్టోరేజీ కోసం వినియోగించాలని సూచించారు.మిల్లర్లకు అన్ని విధాలా ప్రభుత్వం సహకరిస్తుందని, అదే రీతిలో రబీ ధాన్యం కొనుగోళ్ల విషయంలో మిల్లర్లు అధికారులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తనీయవద్దని అన్నారు.కరీంనగర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50% కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో ముందున్నామని తెలిపారు. వారం రోజుల్లోనే 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మరో వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపుల విషయంలోనూ జిల్లా ముందు వరుసలో ఉందని తెలిపారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఒక లక్ష 58 వేల 382 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు 78% ఆన్లైన్లో నమోదు పూర్తయిందని తెలిపారు. 88% ధాన్యం మిల్లర్లు స్వీకరించారని అన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, రైస్ మిల్లులు, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరోగ్య రక్షణకు హెల్త్ ఇన్సూరెన్సే అండ...

**మెడికవర్ ఆధ్వర్యంలో హెల్త్‌టాక్, ఉచిత వైద్య శిబిరం...**




కరీంనగర్ (విజన్ ఆంధ్ర) మే 18.మనిషి ఒక్కసారి తీవ్ర అనారోగ్యం పాలైతే అప్పటి వరకు దాచుకున్న డబ్బంతా వైద్యానికే ఖర్చవుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో మన సేవింగ్స్‌లో కొంత ఖర్చుపెట్టి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే మానసిక ప్రశాంతతతో జీవించవచ్చని కరీంనగర్ మెడికవర్ వైద్యులు తెలిపారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని వీపార్క్ హోటల్‌లో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో హెల్త్‌టాక్, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... ఇన్సూరెన్స్ ఉన్న పేషెంట్లకు రోగి ఆర్థిక పరిస్థితిని కాకుండా, అతనికి అవసరమైన వైద్యాన్ని సమయానికి అందించేందుకు ఇన్సూరెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆరోగ్య సమస్య వచ్చిన తర్వాత ఆందోళన చెందడం కంటే ముందుగానే ఆరోగ్యంపై దృష్టి పెట్టడం ఉత్తమమని సూచించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 150 మందికి నిపుణులైన వైద్యులు సేవలందించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి తక్షణ రోగ నిర్ధారణ చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిభిరం, హెల్త్‌టాక్ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ లోకేష్, డాక్టర్ రాకేష్, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ తాహా, స్టార్ హెల్త్ జోనల్ మేనేజర్ కుమార్ గోపు, డివిజనల్ మేనేజర్ కడార్ల శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ మాదాసు సాగర్, హెచ్‌ఆర్ హరీష్ బండారి, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న మెడికల్ షాపుల బంద్ విజయవంతం చేయండి..

సూర్యాపేట మే 18:(విజన్ ఆంధ్ర) : ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్త మెడికల్ షాప్ లు బంద్ కు పిలుపునివ్వగా దానిలో భాగంగా ఈ నెల 20న సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఒకరోజు మెడికల్ షాపులను బంద్ చేయడం జరుగుతుందని. సూర్యాపేట జిల్లా, పట్టణ, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈనెల 20న బంద్ కు సంబంధించి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, జిల్లా ఎస్పీ కె నరసింహ, జిల్లా డ్రగ్ ఇన్స్ పెక్టర్ తో పాటు జిల్లా అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి అనంతరం అసోసియేషన్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అక్రమ ఈ ఫార్మసీలు వల్ల ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదము ఉన్నదని తెలిపారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ జి ఎస్ ఆర్ 220 ఈ ను వెంటనే



ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్మసీలకు సంబంధించిన జి.ఎస్.ఆర్ 817 ఈ నోటిఫికేషన్ ను రద్దు చేయాలని కోరారు. అలాగే కార్పొరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న కెమిస్ట్ లకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇది ఒక వ్యాపార సమస్యగా చూడవద్దు అని ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించినదని ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న ,మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉంటూ కొన్ని సంవత్సరాలుగా వ్యాపారాల మీద ఆధారపడి జీవిస్తున్న లక్షల కుటుంబాలు జీవన ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఆన్ లైన్ వ్యవస్థను నిర్మూలించాలని ప్రభుత్వాలను కోరారు. బంద్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సూర్యాపేటలో బొడ్రాయి బజార్ లో శ్రీ వినాయక మెడికల్ షాపు , పీఎస్ఆర్ సెంటర్ లో వేదశ్రీ మెడికల్ షాపు, ఎంజి రోడ్ లో కార్తికేయ మెడికల్ షాపు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ ఒక్కరోజు బంద్ కు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యామ ప్రభాకర్, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముశం హరిప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపగాని గిరి గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా శ్రీనివాస్, కోశాధికారి చందన లింగయ్య, ఫార్మాసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ కోశాధికారి కర్నాటి వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి'కి 187 దరఖాస్తులు

**- అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



.కరీంనగర్,(విజన్మే ఆంధ్ర బ్యూరో) మే 18 ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 187 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## బాధితులకు సత్వర న్యాయం లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**- 37 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 18 (విజన్ ఆంధ్ర): ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 37 ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారంపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా త్వరితగతిన పరిష్కారం పొందే అవకాశం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

## పాలమూరు ప్రాజెక్ట్‌పై పాదయాత్రలు కాదు.. సమాధానాలు చెప్పాలి.

**బీఆర్ఎస్, నేతల పనులు హాస్యాస్పదంగా ఉన్నాయి.**



నారాయణపేట, మే 18( విజన్ ఆంధ్ర) : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి లక్ష్మారెడ్డి, లు పాదయాత్ర చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని టీఆర్ఎస్ నేతలు కృష్ణ ముదిరాజ్. మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, గొంగళ్ళ రంజిత్, గవినోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా అత్యధిక వలసలు వెళ్లిన జిల్లాగా పేరొందిందని, సాగునీరు అందిస్తే వలసలు తగ్గుతాయనే ఉద్దేశంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి చేశామని మాజీ మంత్రులు చెబుతున్నారని, అయితే మిగిలిన 20 శాతం పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పనులు పూర్తయి ఉంటే ఇప్పటికే రైతులకు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నర్లాపూర్ నుంచి ఉదండాపూర్ వరకు పాదయాత్ర చేపడతామని ప్రకటించే ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయిందో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రజలు 13 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో అవినీతి, ప్యాకేజీల రాజకీయాలు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, పనుల్లో నాణ్యత కంటే ప్యాకేజీలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. మట్టి తవ్వకాలు, తరలింపుల పేరుతో అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రాజెక్టును ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిశీలించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అంశంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ, అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉంటే రైతులకు ప్రయోజనం కలిగేదన్నారు. వట్టెం నుంచి డిండి వరకు నీళ్లు తరలించే ప్రణాళిక కూడా ఉందన్నారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను కప్పుపుచ్చుకునేందుకే ఇప్పుడు ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు మాజీ మంత్రులకు ప్రాజెక్టులపై పూర్తి అవగాహన లేదని సంపద పోగు చేసుకునేందుకు అవగాహన మాత్రం అద్భుతంగా ఉందని ఎద్దేవ చేశారు, గత ప్రభుత్వాలను తప్పుబడుతున్న నాయకులు తామే అప్పట్లో మంత్రులుగా ఉన్న విషయాన్ని మరిచిపోతున్నారని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో కల్వకుంట్ల కవిత ఇచ్చిన అల్టిమేటం తర్వాతే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అకస్మాత్తుగా మేల్కొని పాదయాత్రలు ప్రకటించడం రాజకీయ నాటకంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ వెంకట రామమూర్తి ప్రభాకర్ దామోదర్ సురేష్ శ్యాం ప్రసాద్ మనోహర్గౌడ్ సౌమ్య రెడ్డి శ్రావణి ఎల్ల స్వామి శ్రీపతిరావు యువత అధ్యక్షుడు మనోజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎప్ సెట్ ఫలితాల్లో "షైన్ విద్యాసంస్థలు" ఘన విజయం

హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 18 ( విజన్ ఆంధ్ర ): ఇటీవల విడుదలైన తెలంగాణ ఎప్ సెట్ - 2026 ఫలితాల్లో హనుమకొండలోని 'షైన్ జూనియర్ కాలేజీ' విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులతో ఘన విజయం సాధించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను సైతం రాష్ట్ర స్థాయి ర్యాంకర్లుగా తీర్చిదిద్దామని కళాశాల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు రమ, ఆరూరి కవిత, కో-ఆర్డినేటర్ రమేష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధించిన ఉత్తమ ర్యాంకులతో పాటు అగ్రికల్చర్ విభాగం సి.హెచ్. అజిత్ రెడ్డి (2193 వ ర్యాంకు), టి. హాసిని (2772 వ ర్యాంకు) సాధించారు. ఈ విభాగంలో మొత్తం 23 మంది విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగం ఎం. ప్రశాంతి (3544), ఎం. దీక్షిత (3969), జి. సిద్దు (4143), సి.హెచ్. రూపాశ్రీలక్ష్మి (5433), ఆర్. సౌరభ్‌వర్మ (5529) అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ విభాగంలో మొత్తం 31 మంది విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులు సాధించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణ, సరైన అకడమిక్ ప్రణాళికలు, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను, వారికి సహకరించిన ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, పి. శ్రీనివాస్, జి. ప్రశాంత్, అధ్యాపక బృందాన్ని మరియు తల్లిదండ్రులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

## క్రీడలతోనే దేశభక్తి భావం పెంపు




ఖమ్మం జిల్లా బ్యూరో, మే 18 (విజన్ ఆంధ్ర) : క్రీడలతోనే క్రీడా స్ఫూర్తి, దేశభక్తి భావం, యువశక్తి వికాసం పెంపొందుతాయని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రజా పాలన - 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాలను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభించారు. 5కే రన్‌కు జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, చైతన్యం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ వారోత్సవాల లక్ష్యమని తెలిపారు. క్రీడలు ఉపాధి అవకాశాలకు కూడా దోహదపడతాయన్నారు. నేడు ఉదయం 10:30 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియం, ఖమ్మంలో "కెరీర్ & స్కిల్ డెవలప్‌మెంట్ - ఎంపవర్ స్కిల్, స్కిల్ ఎంపవర్ ఫ్యూచర్" అనే అంశంపై కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు .ఈ కార్యక్రమం యూట్యూబ్ లైవ్ ద్వారా ప్రసారం అవుతుందని తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని డీవైఎస్‌వో పిలుపునిచ్చారు. వారోత్భాసవాలలో భాగంగా మొదటిరోజు "ఫిట్ & యాక్టివ్ తెలంగాణ" కార్యక్రమం కింద యోగా, ఏరోబిక్స్, మెడిటేషన్, 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, వాకర్స్, విద్యార్థులు, వైద్య అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్ కుమార్, నాగమణి, కోచ్‌లు గౌస్, ఎస్.ఎస్.ఎస్. మూర్తి, చారి, చంద్రకాంత్, కైలాష్, కొండల్, మోహన్, నాగరాజు, సురేష్, హరీష్, నోయల్ జాక్సన్, సీనియర్ బ్యాడ్మింటన్ ప్లేయర్లు, మారథాన్ ప్లేయర్లు, డీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ భూమిలో మళ్లీ నిర్మాణం..

# అధికారుల నిర్లక్ష్యమా!!!!

**- అక్రమార్కులతో అధికారుల ములాకతా????**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర ):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండల కేంద్రంలో రెవెన్యూ భూమి కబ్జా వ్యవహారం మరోసారి స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఓ వ్యక్తి తిరిగి ఇల్లు నిర్మిస్తున్న ఘటనపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టిన సమయంలో అప్పటి తహసీల్దార్ స్వయంగా అక్కడికి వెళ్లి పరిశీలించి అది రెవెన్యూ భూమి అని స్పష్టం చేసి నిర్మాణాన్ని తొలగింపజేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం అదే స్థలంలో మళ్లీ నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, గతంలో రెవెన్యూ అధికారులు స్పష్టంగా ప్రభుత్వ భూమిగా గుర్తించిన ప్రదేశంలో ఇప్పుడు తిరిగి నిర్మాణం జరుగుతోంది. అయితే ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారులు ఈ వ్యవహారంపై మౌనం పాటించడం వివాదాస్పదంగా మారింది. ముఖ్యంగా స్థానిక ఆర్ఐ కనుసైగల్లోనే నిర్మాణ పనులు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగంగానే నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. "గతంలో అక్రమమని ప్రకటించిన భూమిలో ఇప్పుడు ఎలా నిర్మాణం జరుగుతోంది?", "అధికారుల అనుమతి లేకుండా ఇంత పెద్ద ఎత్తున పనులు సాగడం సాధ్యమేనా?" అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది స్థానికులు ఈ వ్యవహారంలో లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ బదిలీ అయిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, గతంలో కఠినంగా వ్యవహరించిన అధికారులు లేకపోవడంతో ఆక్రమణదారులు మళ్లీ చురుకుగా మారారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూముల రక్షణలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే మౌనంగా ఉండటం వల్ల ఆక్రమణలు మరింత పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇప్పటికే మండల కేంద్రంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై కబ్జాల ఆరోపణలు వినిపిస్తుండగా, ఈ ఘటన మరోసారి రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సంబంధిత భూమి రికార్డులను పరిశీలించాలని, నిర్మాణం చట్టబద్ధమా కాదా అనే విషయాన్ని ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణం జరిగితే వెంటనే నిలిపివేసి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.